విశాఖపట్టణం
శుక్రవారం 21 ఆగస్టు 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 209 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన మరో అల్పపీడనం

తెలంగాణాలోని 16 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ

ఏపీలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు

కోస్తాలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు



2

# మహాబలిపురంలో సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

**ఏపీ విభజన సమస్యల ప్రస్తావన!**

**కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్ వేయాలని చంద్రబాబు ప్రతిపాదన!**

**డీలిమిటేషన్‌పై డీకే శివకుమార్ గళం**

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణాది జోనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు చారిత్రక ప్రసంగం చేశారు. ఏపీ విభజన పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని అమిత్‌షాను రిక్వెస్ట్ చేశారు. తమిళనాడులోని చారిత్రక ప్రాంతమైన మహాబలిపురం వేదికగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరిగిన 31వ దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత కీలకమైన ప్రసంగం చేశారు. ఈ ప్రతిష్టాత్మకమైన సమావేశానికి ఏపీ సీఎంతోపాటు తమినాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర ప్రభుత్వ ..మిగతా 2లో



## అమిత్ షా మీటింగులో ప్రత్యేక ఆకర్షణంగా చంద్రబాబు - విజయ్

2



మత్స్యకారుల గల్లంతుపై చంద్రబాబు

# సీరియస్

**ఎస్‌వోపీ అమలు చేయాలని ఆదేశం**

కోనసీమ మత్స్యకారుల గల్లంతుపై

సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన ఎస్‌వోపీ అమలు చేయాలని అధికారులకు ఆదేశం

మత్స్యకారుడు అప్పన్న కోసం గాలింపు ముమ్మరం చేయాలన్న హోంమంత్రి అనిత

కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత గాలింపు

బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రభుత్వ భరోసా

2

# పిల్లలపై ఎలాంటి ఒత్తిడి పడకూడదు

త్రిభాషా విధానంపై సుప్రీంకోర్టు

సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెట్టడంలో తప్పు లేదన్న సుప్రీంకోర్టు

అయితే దాన్ని అమలు తీరుపైనే ఆందోళనలని వ్యాఖ్యలు

ఏ భాషనైనా నేర్చుకోవడం ఒక గొప్ప ఆస్తిగా పేర్కొన్న దేశ అత్యున్నత న్యాయస్థానం





**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

సీబీఎస్ఈ త్రిభాషా విధానంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ విధానం వల్ల పిల్లలపై ఎలాంటి ఒత్తిడి పడకూడదని పేర్కొంది. 9వ తరగతి విద్యార్థులు మూడు భాషలను అభ్యసించడాన్ని తప్పనిసరి చేస్తూ సీబీఎస్ఈ తీసుకొచ్చిన విధానం వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిన ..మిగతా 2లో

నీట్ నిరసనలపై సుప్రీంకోర్టు

# కీలక నిర్ణయం

పోలీసుల చర్యలపై ఐదుగురు సభ్యులతో విచారణ కమిటీ

జంతర్‌మంతర్‌లో పోలీసుల చర్యలపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం


ఐదుగురి సభ్యులతో విచారణ కమిటీ ఏర్పాటు చేసిన సుప్రీంకోర్టు-

ఆందోళనకారులపై పోలీసుల చర్యలను విచారించనున్న కమిటీ

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**



నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి వ్యతిరేకంగా చలో పార్లమెంట్ చేపట్టిన ఆందోళనకారులపై పోలీసులు బలప్రయోగం చేశారనే ఆరోపణలపై విచారణ జరిపేందుకు సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఐదుగురు సభ్యులతో కూడిన అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయమాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ..మిగతా 2లో



హోం వర్క్ చేయలేదని

## కొట్టిన టీచర్... ప్రాణాలు విడచిన బాలుడు

కేజీహెచ్‌లో కుటుంబ సభ్యుల ఆందోళన

పాఠశాలలో ఉద్రిక్త వాతావరణం

కుటుంబానికి అండగా ఉంటామన్న మంత్రి లోకేష్

**విశాఖపట్నం, ఆగష్టు 20, జయ జయహే :**

విశాఖ నగరంలో తీవ్ర కలకలం రేపిన ఘోర ఉదంతం వెలుగుచూసింది. ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలి నిర్వాకానికి ఓ ఆరేళ్ల పసిప్రాణం బలైపోయింది. హోంవర్క్ చేయలేదన్న నెపంతో ఉపాధ్యాయురాలు విచక్షణారహితంగా కొట్టడంతో యూకేజీ చదువుతున్న ప్రణయ్ తేజ్ అనే బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ హృదయవిదారక ఘటన వన్ టౌన్ పరిధిలోని 'లిటిల్ గార్డెన్ స్కూల్ ' లో చోటుచేసుకుంది.

**పాఠశాలలోనే కుప్పకూలిన చిన్నారి:**

కుటుంబ సభ్యులు మరియు ప్రత్యక్ష సాక్షుల ..మిగతా 2లో

# మార్గదర్శికి సుప్రీంలో భారీ ఊరట

**ఉండవల్లి పిటిషన్ కొట్టివేత**

మార్గదర్శి కేసులో ఉండవల్లి అరుణ్ కుమార్ పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

డిపాజిటర్లకు రూ.2,500 కోట్లు చెల్లించామని తెలిపిన మార్గదర్శి

ఇది వ్యక్తిగత వివాదంలా ఉంది, ప్రజా ప్రయోజనం లేదన్న ధర్మాసనం

తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థించడంతో మార్గదర్శిపై క్రిమినల్ కేసులు ముగింపు

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

ఈనాడు గ్రూప్ నకు చెందిన మార్గదర్శి ఫైనాన్షియర్స్ కేసులో ఆ సంస్థకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ కేసులో ప్రజా ప్రయోజనం ఏమీ కనిపించడం లేదని, ఇది వ్యక్తిగత వివాదంలా ఉందని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ప్రసన్న బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

**విచారణలో వాదనలు, కోర్టు వ్యాఖ్యలు**

గురువారం ఈ పిటిషన్‌పై తుది విచారణ సందర్భంగా మార్గదర్శి తరఫున సీనియర్





న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, నాగముత్తు వాదనలు వినిపించారు. డిపాజిటర్లకు ఇప్పటివరకు రూ.2,500 కోట్లు చెల్లించామని, క్లెయిమ్ చేయని రూ.5.23 కోట్లను ఎస్క్రో అకౌంట్‌లో ఉంచామని ..మిగతా 2లో

## ఉచిత పథకాలపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం

2



**కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లపై స్టే ఎత్తివేతకు నిరాకరణ**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయన్న తెలంగాణ హైకోర్టు

ఉచిత పథకాలకు నిధుల మళ్లింపు వల్ల అత్యవసర రంగాలపై ప్రభావం పడుతోందని వ్యాఖ్య

నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తే ఉచితాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని వ్యాఖ్య

# మహాబలిపురంలో సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

మొదటి పేజీ తరువాయి...



ఉన్నతాధికారులు హాజరయ్యారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ఈ సదస్సు సాగింది.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ డాక్యుమెంట్ ప్రవేశపెట్టారు. రాష్ట్రాల ప్రయోజనాలతోపాటు దేశ పురోగతిలో దక్షిణాది పాత్రను వివరిస్తూ, పోటీ కంటే రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అత్యంత అవసరమని ఆయన పిలుపునిచ్చారు.

కేంద్రం- రాష్ట్రాలు, అలాగే వివిధ రాష్ట్రాల మధ్య ఉండే ఘర్షణలు, విభేదాలు దేశాభివృద్ధికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగపడవని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పరస్పర నమ్మకం, నిరంతర సంప్రదింపులు ఇచ్చిపుచ్చుకునే ధోరణి, బలమైన సహకార సమాఖ్య విధానం ద్వారానే ఎంతటి సంక్లిష్ట సమస్యలనైనా పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు.

దక్షిణాది రాష్ట్రాలు కేవలం పెట్టుబడులు కోసమో, పరిశ్రమల స్థాపన కోసమో లేదా మౌలిక సదుపాయాల కోసమో పరస్పరం పోటీ పడటంతో ఆగిపోకూడదని ఆయన హితువు పలికారు. కొన్ని అత్యంత కీలకమైన రంగాల్లో అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా ఉమ్మడి ప్రణాళికలతో పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని ప్రతిపాదించారు.

2047 నాటికి ట్రిలియన్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ

భారత్ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాలు దాదాపు 31 శాతం వాటా కలిగి ఉన్నాయని సీఎం చంద్రబాబు వివరించారు. ఈ ప్రాంతానికి ఉన్న సమష్టి ఆర్థిక శక్తి అపారమైందని ఆయన చాటి చెప్పారు.

వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణ భారత్ ఒక ప్రధాన ఆర్థిక శక్తిగా నిలవడానికి మనమంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ క్రమంలోనే 2047 నాటికి దక్షిణ భారత్‌ని 10 ట్రిలియన్ డాలర్ల అద్భుత ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యంగా అందరం చేతులు కలపాలని ఆయన ప్రతిపాదించారు.

రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు

దక్షిణాది రాష్ట్రాల మధ్య వ్యాపార కార్యకలాపాలు వేగవంతం కావడానికి, సరకు రవాణా వ్యయం తగ్గడానికి, ఉపాధి అవకాశాలు మెరుగుపడటానికి బలమైన రవాణా అనుసంధానం ఎంతో అవసరమని చంద్రబాబు సూచించారు.

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలను వేగంగా అనుసంధానించేలా కుప్పం మీదుగా బులెట్ ట్రైన్ నడపాలనే సరికొత్త ప్రతిపాదనను కేంద్రం ముందు ఉంచారు. దక్షిణాదిలోని మూడు ప్రధాన కేంద్రాలైన అమరావతి, బెంగళూరు, చెన్నై నగరాలను అత్యంత బలమైన వేగవంతమైన రవాణా వ్యవస్థతో అనుసంధానించాలని ఆయన స్పష్టం చేశారు. దీని వల్ల పెట్టుబడులు పెరగడమే కాకుండా రవాణా వ్యవస్థ మరింత సులువు అవుతుందని చెప్పారు.

నీటి వివాదాలకు శాశ్వత పరిష్కారం

దక్షిణాది రాష్ట్రాల మధ్య తరచూ తలెత్తే నీటి వివాదాలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక ప్రతిపాదన చేశారు. కేవలం నీటి పంపిణీ గురించి చర్చించుకుంటూ వివాదాలు సృష్టించుకోవడం కంటే నీటి సమర్థ వినియోగం వైపు దృష్టి పెట్టాలని సూచించారు.

గోదావరి నదికి వచ్చే మిగులు వరద జలాల నుంచి దాదాపు 500 టీఎంసీలకుపైగా నీటిని కృష్ణా, పెన్నా నదుల మీదుగా కావేరి బేసిన్‌కు తరలించాలని ఆయన ప్రతిపాదించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు శాశ్వత నీటి భద్రత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఈ ప్రతిష్టాత్మక అనుసంధానం విజయవంతం కావడానికి ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు అత్యంత సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. భవిష్యత్‌లో గంగా-కావేరీ నదుల అనుసంధానానికి సంబంధించి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. ఈ నదుల అనుసంధానంపై కాలపరిమితితో కూడిన డీపీఆర్, తగిన అనుమతులను త్వరగా మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారానికి రిక్వెస్ట్

సదస్సులో సీఎం చంద్రబాబు కేవలం ప్రాంతీయ ప్రయోజనాల గురించే కాకుండా ఏపీ రాష్ట్రానికి సుదీర్ఘ కాలంగా కేంద్రం నుంచి అందాల్సిన సాయంపై గళమెత్తారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి 12ఏళ్లు గడుస్తున్నప్పటికీ విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 పరిధిలోని సంస్థల విభజన ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని గుర్తు చేశారు. సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే వేగవంతమైన చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రానికి చట్టబద్ధ రాజధాని హోదాగా అమరావతిని సాధించామని చెప్పారు. ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ అమరావతి రాజధాని ప్రాజెక్టులు కేంద్ర సహాయంతో అవుతున్నాయని ప్రకటించారు.

రాష్ట్ర విభజన కారణంగా ఎదుర్కొంటున్న వనరుల లోటును, సెక్షన్ 56లోని కీలక అంశాలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. దుగ్గరాజుపట్నం పోర్టు, అనుబంధ రిఫైనరీ ప్రతిపాదనలకు వేగంగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. విశాఖ, విజయవాడలో ప్రతిపాదించిన మెట్రో రైల్ ప్రాజెక్టులకు కేంద్ర అనుమతులు త్వరగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కడప జేఎస్డబ్ల్యూ రైల్వే లింక్‌కు కేంద్ర నుంచి వెంటనే అనుమతులు సాధించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## మార్గదర్శికి సుప్రీంలో భారీ ఊరట

మొదటి పేజీ తరువాయి...

వారు కోర్టుకు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారమే పబ్లిక్ నోటీసు జారీ చేసి, సెటిల్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేశామని వివరించారు.

ఈ సమయంలో ధర్మాసనం పిటిషనర్ ఉండవల్లి అరుణ్ కుమార్‌ను ఉద్దేశించి పలు కీలక ప్రశ్నలు సంధించింది. "ఈ పిటిషన్ వేసి, పోరాడటానికి మీరెవరు?" అని ప్రశ్నించింది. "ఈ కేసు వివరాలు పరిశీలిస్తే ఇది పూర్తిగా వ్యక్తిగత వివాదంలా కనిపిస్తోంది. ఇందులో ఎలాంటి ప్రజా ప్రయోజనం మాకు కనిపించడం లేదు. మీరు వాదించే కొద్దీ మీపైనే అనుమానాలు పెరుగుతున్నాయి" అని జస్టిస్ సుందరేశ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ధర్మాసనం ఉండవల్లి పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.

**కేసు నేపథ్యం, తాజా పరిణామాలు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో 2008లో మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థ ఆర్‌బీఐ నిబంధనలు ఉల్లంఘించి డిపాజిట్లు సేకరించిందనే ఆరోపణలతో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసులపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు, 2025 ఆగస్టులో ఆ క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొట్టివేసింది. డిపాజిటర్లకు డబ్బులు తిరిగి చెల్లించడం, సంస్థ ఛైర్మన్ రామోజీ రావు మరణం వంటి పరిణామాల నేపథ్యంలో కేసును కొనసాగించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.

తెలంగాణ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ ఉండవల్లి అరుణ్ కుమార్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా సుప్రీంకోర్టు ఈ పిటిషన్‌ను కొట్టివేయడంతో తెలంగాణ హైకోర్టు తీర్పునకు ఆమోదం లభించినట్లయింది. దీంతో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై దశాబ్దాలుగా నడుస్తున్న క్రిమినల్ కేసులకు పూర్తిగా ముగింపు పలికినట్లయింది.

## అమిత్ షా మీటింగులో ప్రత్యేక ఆకర్షణంగా చంద్రబాబు - విజయ్

మొదటి పేజీ తరువాయి...

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రంలో ఉన్న ప్రముఖ సముద్రతీ పర్యాటక ప్రాంతమైన మహాబలిపురంలో దక్షిణాది మండలి సదస్సు జరుగుతోంది. ఇందులో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, కేరళ ముఖ్యమంత్రి సతీశన్, కర్నాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. ఇందులో చంద్రబాబు - విజయ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలించారు. ముఖ్యమంత్రుల సమావేశానికి సంబంధించిన ఫొటోలను ఏపీ సీఎం కార్యాలయం ట్విట్టర్ వేదికగా పోస్ట్ చేసింది. ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించిన కీలక అంశాలు, కేటాయింపులు, ఇతర అంశాలపై చర్చించారు. ప్రధానంగా నీట్ వివాదం, కావేరి జలాలు, నియోజకవర్గాల పునర్విభజనపై తమ అభ్యంతరాలను దక్షిణాది రాష్ట్రాల సీఎంలు అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లారు.

## హోం వర్క్ చేయలేదని కొట్టిన టీచర్... ప్రాణాలు విడచిన బాలుడు

మొదటి పేజీ తరువాయి...

కథనం ప్రకారం.. బాలుడు ప్రణయ్ తేజ్ రోజూలాగే పాఠశాలకు వెళ్లాడు. అయితే, హోంవర్క్ పూర్తి చేయలేదనే కారణంతో సదరు క్లాస్ టీచర్ బాలుడిపై తీవ్రంగా చేయి చేసుకుంది. టీచర్ కొట్టిన దెబ్బలకు తాళలేక ఆ చిన్నారి పాఠశాల తరగతి గదిలోనే ఒక్కసారిగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. దీంతో భయాందోళనకు గురైన పాఠశాల సిబ్బంది, బాలుడిని చికిత్స నిమిత్తం అత్యవసరంగా కింగ్ జార్జ్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే, దురదృష్టవశాత్తూ ఆసుపత్రికి తరలించే మార్గమధ్యంలోనే బాలుడి పరిస్థితి విషమించి కన్నుమూసినట్లు కుటుంబ సభ్యులు నిర్ధారించారు.

**వెలుగులోకి వచ్చిన సీసీటీవీ దృశ్యాలు , బంధువుల ఆరోపణలు:**

ఈ ఘటనకు సంబంధించి పాఠశాలలోని సీసీటీవీ ఫుటేజ్ సోషల్ మీడియా, మీడియా మాధ్యమాల్లో వెలుగులోకి రావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ ఫుటేజ్‌లో సదరు ఉపాధ్యాయురాలు కేవలం ప్రణయ్ తేజ్‌నే కాకుండా, క్లాస్‌లోని మరికొంత మంది విద్యార్థులను కూడా తీవ్రంగా కొడుతున్న దృశ్యాలు ఉన్నట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయుల క్రూర ప్రవర్తనకు ఈ దృశ్యాలే నిదర్శనమని వారు మండిపడుతున్నారు.

**కేజీహెచ్ వద్ద ఉద్రిక్తత.. న్యాయం కోసం డిమాండ్:**

బాలుడి మరణవార్త తెలియడంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైన తల్లిదండ్రులు, బంధువులు కింగ్ జార్జ్ హాస్పిటల్‌కు భారీగా చేరుకున్నారు. పాఠశాల యాజమాన్యం, బాధ్యురాలైన టీచర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆసుపత్రి వద్ద తీవ్ర ఆందోళనకు దిగారు. తమకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదంటూ బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి బాధితులను సముదాయించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. బాలుడి మృతికి గల అసలు కారణాలు సీసీటీవీ ఫుటేజ్ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత, అలాగే వైద్యుల నివేదిక మరియు పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగానే అధికారికంగా స్పష్టత రానుందని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతపై కఠిన పర్యవేక్షణ ఉండాలని, పిల్లలపై శారీరక దాడులకు పాల్పడే ఉపాధ్యాయులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఆ కుటుంబానికి ప్రణయ్ తేజ్ లేని లోటు పూడ్చలేమని అయితే ఆ కుటుంబానికి కూటమి సర్కార్ అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

## తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన..

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావం కారణంగా తెలంగాణలో నేటి (ఆగస్టు 21) నుంచి ఈ నెల 28వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రధానంగా అదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఏలూరు, పోలవరం ప్రాంతాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అలాగే కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, మిగిలిన కోస్తా జిల్లాల్లో చెదురుమదురు జల్లులు పడతాయని వివరించింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

## మత్స్యకారుల గల్లంతుపై చంద్రబాబు సీరియస్

మొదటి పేజీ తరువాయి...

బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఏడుగురు మత్స్యకారుల గల్లంతు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాదని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్టమైన ప్రామాణిక కార్యాచరణ విధానం (ఞ్రూ-ళ్ఖుఅఝుతీఀ ౯ాజూవతీఖ్ఱఅస్త్ర ్రాతీశీఛెవసబతీవ) అమలు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై గురువారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

సమీక్ష సందర్భంగా చంద్రబాబు పలు కీలక ప్రశ్నలను అధికారులపై సంధించారు. "బోటులో ట్రాన్స్‌పాండర్ ఏమైంది? ఆ బోటు ఒక్కటే ఎందుకు వేటకు వెళ్లింది? గల్లంతైనట్లు సమాచారం ఎప్పుడు అందింది? గాలింపు చర్యలు ఎప్పుడు ప్రారంభించారు?" అంటూ లోతుగా ఆరా తీశారు. కేవలం ఘటన జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందస్తు నివారణ చర్యలపై దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలను మరింత విస్తృతం చేయాలని సూచించారు.

ఈ నెల 3వ తేదీన అల్లవరం మండలం ఓడలరేవు తీరం నుంచి ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. సాధారణంగా 10 రోజుల్లో తిరిగి రావాల్సి ఉండగా, గడువు దాటినా వారి నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గల్లంతైన బోటులో 15 రోజులకు సరిపడా రేషన్, వెయ్యి లీటర్ల డీజిల్ ఉన్నాయని, ప్రాథమిక సమాచారం ప్రకారం బోటు విశాఖ లేదా పారాదీప్ వైపు వెళ్లి ఉండవచ్చని జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసులు విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. సమీక్ష సందర్భంగా చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. సాంకేతిక లోపాలు, భద్రతా వైఫల్యాలపై దృష్టి సారించాలని సూచించారు. గల్లంతైన మత్స్యకారుల వివరాలు: కోపనాతి రామకృష్ణ (కొమరగిరిపట్నం), సంఘాని తాతారావు (బలుసుతిప్ప), పాలెపు శాంతారావు (ఓడలరేవు), ఏసుదాస్ (అడగట్లపాలెం), కొల్లాటి శ్రీనివాస్ (ఓడలరేవు), కాటాడి సతీశ్ (పశువులంక), కర్రి రాముడు (నక్క రామేశ్వరం). వీరి ఆచూకీ కోసం అధికారులు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నారు.

## నీట్ నిరసనలపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి...

ధర్మాసనం ఈ మేరకు నిర్ణయించింది. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్ సుభాశ్ రెడ్డి ఈ కమిటీకి నేతృత్వం వహించనున్నారు. ఆయనతో పాటు పంజాబ్-హరియాణా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆర్‌కే ఝా, దిల్లీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ శలిందర్ కౌర్, సీబీఐ మాజీ డైరెక్టర్ ఆర్‌కే శుక్లా, మేఘాలయ మాజీ డీజీపీ ఎల్‌ఆర్ బిష్ణోయ్ కమిటీ సభ్యులుగా ఉన్నారు.

**ఆందోళనకారులపై పోలీసుల చర్యలను విచారించనున్న కమిటీ**

ఈ కమిటీ ప్రధానంగా రెండు కోణాల్లో సమగ్ర విచారణ చేపట్టనుంది. మొదటగా పోలీసుల చర్యలపై వచ్చిన ఆరోపణలు, నిరసనకారులపై పెల్లెట్ గన్స్, ఎలక్ట్రిక్ లాఠీలు, టియర్ గ్యాస్ ప్రయోగం, లాఠీఛార్జి వంటి తీవ్రమైన చర్యలపై విచారణ జరపనుంది. మహిళా నిరసనకారులపై హింస, పోలీసుల నిఘా వ్యవహారాలు, అల్లర్లను నియంత్రించే క్రమంలో అవసరానికి మించి భద్రతా బలగాలు వ్యవహరించాయా అన్న కోణంలో విచారణ చేయనుంది. మరోవైపు ఆందోళనకారుల వల్ల విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై జరిగిన దాడులు, హింసాత్మక ఘటనలు, నిరసనల పేరుతో జరిగిన ప్రభుత్వ, ప్రజా ఆస్తుల ధ్వంసంపైనా ఉన్నతస్థాయి కమిటీ విచారణ జరపనుంది.

"ఈ అత్యున్నత స్థాయి విచారణ కమిటీని (న్యూజుజ) ఏర్పాటు చేసేటప్పుడు సభ్యుల వ్యక్తిగత నైపుణ్యం, అనుభవం, కమిటీలోని వైవిధ్యం వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నాం. న్యూజుజ చేసే సిఫార్సులు ఈ న్యాయస్థానానికి ఎంతో విలువైన సహాయాన్ని అందిస్తాయి. తగిన పరిశీలన అవసరమైన అన్ని అంశాలపై కమిటీ సమగ్ర అంచనాను చేపట్టగలదని మాకు నమ్మకం ఉంది. అదేవిధంగా పోలీసు అధికారులు, భద్రతా సిబ్బంది వల్ల నిరసనకారులకు తీవ్రమైన హాని, గాయాలు కలిగినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా న్యూజుజ అంచనా వేయవచ్చు. అలాగే, అటువంటి అకృత్యాలకు దారితీసిన పరిస్థితులు, అందుకు బాధ్యులైన వ్యక్తులు, బలాన్ని ప్రయోగించేటప్పుడు ఏవైనా చట్టాలు, నిబంధనలు లేదా ప్రమాణాలు ఉల్లంఘించారా? వంటి అంశాలను కూడా విచారించవచ్చు" అని ధర్మాసనం పేర్కొంది. న్యూజుజ చేపట్టే విచారణ ఒక్కసారి మాత్రమే చేసే ప్రక్రియగా పరిమితం కాకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

## పిల్లలపై ఎలాంటి ఒత్తిడి పడకూడదు

మొదటి పేజీ తరువాయి...

అవసరాన్ని ప్రస్తావించింది. త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టడంలో తప్పు లేదని, అయితే దానిని అమలు చేస్తున్న తీరుపైనే పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారని తెలిపింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ సూర్య కాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వి. మోహనాలతో కూడిన సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది.

"త్రిభాషా విధానంపై విద్యార్థులకు ఉన్న సమస్యలలో కొన్నింటిని పునఃపరిశీలించాలి. ఎప్పటికైనా త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టాల్సిందేనన్న విషయంలో ఎలాంటి సందేహం లేదు. అందులో తప్పు కూడా ఏమీ లేదు. కానీ త్రిభాషా విధానం అమలులో ఎదురవుతున్న ఆటంకాలు, సమస్యలకు పరిష్కారం కనుక్కోవడంపై దృష్టి సారించాలి. అందుబాటులో ఉన్న భాషా ఎంపికలకు సంబంధించి తగిన మానవ వనరుల వ్యవస్థను ఎలా నిర్మించాలనేది పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలలో ఒకటి. ఒకవేళ ఆరో తరగతిని త్రిభాషా విధానానికి ప్రారంభ దశగా ఎంచుకున్నట్లయితే ఈ ఏడాది ఆరో క్లాస్ విద్యార్థులకు కొంత వెసులుబాటు కల్పించాలి. వచ్చే ఏడాది నుంచి త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టాలి. అంతేకాకుండా ఈ విధానాన్ని అసలు 6వ తరగతి నుంచి ప్రారంభించాలా? లేక ప్రాథమిక స్థాయిలోనే 3 లేదా 4వ తరగతి నుంచే అమలు చేయాలా? అనే విషయాన్ని కూడా పునరాలోచించాలి." అని కేంద్రం తరఫున వాదిస్తున్న అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటికు ధర్మాసనం తెలిపింది.

త్రిభాషా విధానం అమలు సముచితంగా జరగాలి : సుప్రీంకోర్టు

ఇంగ్లీష్‌ను మాతృభాషగా పరిగణించాలా? విదేశీ భాషగా పరిగణించాలా? అనేది కూడా ఒక ఆందోళనకరమైన అంశమని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. భారత ప్రభుత్వం తరపున, సీబీఎస్ఈతో పాటు ఇతర విద్యా బోర్డులలో ఏం జరుగుతుందో కూడా మీరు (కేంద్రం తరఫున వాదిస్తున్న ఐశ్వర్య భాటినుద్దేశించి) గమనించాలని కోరింది. సీబీఎస్ఈ త్రిభాషా విధానం అమలు సముచితంగా జరిగేలా చూసుకోవాలని సూచించింది. ఈ విషయంలో పిల్లలపై ఎలాంటి ఒత్తిడి పడాలని తాము కోరుకోవడం లేదన్నారు.

జులై 1 నుంచి 9వ తరగతి విద్యార్థులు రెండు భారతీయ భాషలతో సహా మొత్తం మూడు భాషలను తప్పనిసరిగా అభ్యసించాలన్న సీబీఎస్ఈ విధానాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం గురువారం విచారణ చేపట్టింది. ఈ విచారణ ప్రారంభంలో కొంతమంది పిటిషనర్ల తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ఆనంద్ గ్రోవర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ అంశం మూడు భాషలకు సంబంధించినదని, తమ ఆందోళన ప్రధానంగా ఆరో తరగతి విద్యార్థుల గురించేనని ధర్మాసనానికి తెలిపారు. 6- 8వ తరగతుల వరకు పాఠ్యప్రణాళికను రూపొందించే అధికారం లేదా పరిధి సీబీఎస్ఈకి లేదని, ఆ బాధ్యత ఎన్‌సీఈఆర్‌టీకి ఉంటుందని పేర్కొన్నారు. త్రిభాష బోధన కోసం అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉండాలని గ్రోవర్ అన్నారు.

**'అన్ని భాషలను గౌరవించాలి'**

"సీబీఎస్ఈ ఏదైనా భాషను ప్రవేశపెడుతున్నట్లయితే ఉపాధ్యాయుల కోసం కూడా ప్రణాళిక కలిగి ఉండాలి. అది వారి బాధ్యతే. పాఠశాలలు తప్పులు చేస్తే వాటిని నిలదీస్తాం. సీబీఎస్ఈ 23 భాషల ఎంపిక అవకాశాలను కల్పించింది. ప్రాంతీయ భాషల పట్ల మనకు ఎలాంటి న్యూనతా భావం ఉండకూడదు. ఇతర భాషల మాదిరిగానే మనం ఈ భాషలన్నింటినీ గౌరవించాలి. త్రిభాషా విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు కొన్ని సందేహాలు కలగడం సహజం. త్రిభాషా విధానం అమలులో ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు సిఫార్సులు చేయడానికి, పరిష్కారాలను కనుగొనడానికి మేమే స్వయంగా ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తాం. లేదంటే ప్రభుత్వాన్ని ఒక కమిటీని ఏర్పాటు చేయమని కోరుతాం." అని సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**భాష అనేది ఒక సంస్కృతికి వాహకం : అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య**


ఈ వ్యాఖ్యలకు కేంద్రం తరఫున వాదిస్తున్న అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి బదులిచ్చారు. తాము విద్యార్థులకు సాధ్యమైనంత మద్దతు ఇవ్వాలనుకుంటున్నామని తెలిపారు. ఈ విషయంలో వేలాది మంది నిపుణులను సంప్రదించినట్లు పేర్కొన్నారు. "దేశంలోని విద్యా బోర్డులలో సీబీఎస్ ఒకటి. మొత్తం 7.5 లక్షల పాఠశాలల్లో సుమారు 33,000 స్కూల్స్ దీని పరిధిలో ఉన్నాయి. దేశంలోని పాఠశాలల్లో సుమారు 4.45 శాతం సీబీఎస్ఈ పాఠశాలలే. వీటిలో 99.19 శాతం పాఠశాలలు ఇప్పటికే రెండు స్థానిక భాషల విధానాన్ని పాటిస్తున్నాయి. భాష అనేది ఒక సంస్కృతికి వాహకం." అని ఐశ్వర్య పేర్కొన్నారు.

అయితే ఐశ్వర్య భాటి 'స్థానిక' అనే పదం వాడడంపై తనకు వ్యక్తిగతంగా తీవ్ర అభ్యంతరం ఉందని న్యాయమూర్తి జస్టిస్ బాగ్చీ పేర్కొన్నారు. ఈ పదంలో వలసవాద ఛాయలు ఉన్నాయని, అందుకు బదులుగా దేశీయ అనే పదాన్ని వాడాలని సూచించారు. విధాన రూపకర్తలు తాము ఉపయోగించిన పదాల పట్ల స్పృహతో ఉండాలని అభిప్రాయపడ్డారు.

# సి.ఆర్.జెడ్, అటవీ చట్టాలు అభివృద్ధికి ఆటంకం కాకూడదు: అసెంబ్లీలో గంటా

**విశాఖపట్నం, ఆగస్టు 20: (జయ జయహే)**

సి.ఆర్.జెడ్, అటవీ శాఖ చట్టాలు నిర్మాణాలకే పరిమితం చేయకుండా పర్యావరణానికి, అభివృద్ధికి మధ్య సమతౌల్యం సాధించేలా ఉండాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ విశాఖ అభివృద్ధికి గుండె కాయగా భావించే విశాఖ - భీమిలి బీచ్ రోడ్డు వెంబడి ఎలాంటి నిర్మాణాలు, రెస్టారెంట్లు, అభివృద్ధి కార్యక్రమాలు జరగడం లేదని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు ఎవరైనా తప్పనిసరిగా పాటించాల్సిందేనని చెబుతూ అభివృద్ధికి ఆటంకం కాని రీతిలో ఉండాలన్నారు. సాగర్ నగర్ బీచ్ లో రూ.15 కోట్లతో ప్రతిపాదించిన ఎకాలజీ పార్కు అటవీ శాఖ అభ్యంతరంతో ఆగిపోయిందని చెప్పారు. ఇదే బీచ్ లో కోకో చెట్లు ఎండిపోతుండడంతో వాటికి నీరు పోయడానికి ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్ లు రానివ్వకుండా అడ్డు చెబుతున్నారన్నారు.



అమావాస్య రోజు 40 వేల మంది వరకు యాత్రికులు దర్శించుకునే సింహాచలం కాలభైరవ స్వామి ఆలయానికి సక్రమమైన దారి సహా మంచినీరు, వాష్ రూంలు, నీడనిచ్చే షెడ్ నిర్మాణానికి అటవీ శాఖ అధికారులు ఒప్పుకోలేదని పేర్కొన్నారు.

**ఇనాం భూసమస్య పరిష్కరించాలి**

భీమిలి నియోజకవర్గంలోని నారాయణరాజు పేట, బోని, కృష్ణాపురం, ముచ్చర్ల, శిర్లపాలెం, పద్మనాభం, బి.ఆర్. తాళ్లవలస గ్రామాల్లో 3 వేల ఎకరాల ఇనాం భూముల సమస్య పరిష్కరించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అసెంబ్లీలో కోరారు. రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ములు కూడా పడడం లేదని చెప్పారు. రెవిన్యూ సదస్సులో మంత్రి అనగాని సత్యప్రసాద్ రైతులకు హామీ ఇచ్చారని చెబుతూ సమస్య పరిష్కారానికి అధికారులకు నిర్దిష్ట సమయాన్ని నిర్దేశించాలని సూచించారు. ఏళ్ల తరబడి భూముల్లో ఉన్నా రుణాలు తెచ్చుకోవడానికి, పిల్లల పెళ్లిళ్ల విషయంలోనూ ఏ రకంగాను ఈ భూములు ఉపయోగపడడం లేదని తెలిపారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి సమస్య పరిష్కారం కోసం రైతులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.



## పూడిమడకలో రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు

**అచ్యుతాపురం, ఆగస్టు 20, జయ జయహే:**


భారత మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ 82వ జయంతి వేడుకలు పూడిమడకలో ఘనంగా జరిగాయి. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తనకాల అనంతరావు రాజీవ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంతరావు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశాన్ని ముందుకు తీసుకు వెళ్లారని, దేశ సమగ్రత కోసం, సామరస్యత కోసం అహర్నిశల పనిచేశారని అన్నారు. 21 సంవత్సరాలు ఉన్న ఓటు హక్కును 18 సంవత్సరాలుగా ఓటు హక్కు కల్పించి భారత ప్రజాస్వామ్యంలో యువకులకు పాత్ర కల్పించారని అన్నారు. దురదృష్టకరంగా తీవ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయారని అన్నారు. రాజీవ్ చూపినదారిలో దేశ సమగ్రత కోసం సామరస్యత కోసం పాటుపడతామని కాంగ్రెస్ నాయకుల ప్రతిజ్ఞ చేశారు. జిల్లా మత్స్యకార సెల్ అధ్యక్షులు మేరుగు అచ్చిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎంవిఆర్ రాహుల్, చేపల సత్తిబాబు (జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి), చోడిపల్లి పెంటయ్య (మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు), చింతకాయలు జగదీష్ సూరాడు కాసుబాబు, మైలుపల్లి దుర్గ, దోని శివ, వాడమధుల సతీష్, తెడ్డు పోలయ్య, కడియాల వెంకట అప్పారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీశెట్టి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## వరలక్ష్మి వ్రతం వేళ.. పూల పరిమళంతో కడియపులంక మార్కెట్ కళకళ!

**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్టు 20**

కడియపులంక: వరలక్ష్మి వ్రతం సందర్భంగా పూలకు డిమాండ్ ఒక్కసారిగా పెరగడంతో కడియపులంక అంతరాష్ట్ర పూల మార్కెట్ గురువారం కొనుగోలుదారులతో కళకళలాడింది. శ్రావణ శోభకు తోడు వరలక్ష్మి వ్రతం పూల వ్యాపారానికి ఊపునిచ్చింది. పూజా సామగ్రిలో పూలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉండటంతో తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు, కొనుగోలుదారులు మార్కెట్‌కు తరలివచ్చారు.స్థానికంగా దిగుబడులు తగ్గడంతో తమిళనాడు, కర్ణాటక నుంచి బంతి, చామంతి, గులాబీ తదితర పూలను భారీగా తీసుకొచ్చారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, తెలంగాణ, ఒడిశా ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు పెద్దఎత్తున కొనుగోళ్లు చేపట్టారు. దీంతో మార్కెట్‌లో పూల రాక, విక్రయాలు జోరందుకున్నాయి.వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో ఈ ప్రాంతంలో పూల దిగుబడులు తగ్గడం, ఇతర రాష్ట్రాల నుంచి పూలను దిగుమతి చేసుకోవాల్సి రావడంతో ధరల్లోనూ పెరుగుదల కనిపించింది. వరలక్ష్మి వ్రతం నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు పూలకు డిమాండ్ కొనసాగుతుందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. శ్రావణమాసం ప్రారంభం నుంచి మందకొడిగా ఉన్న పూల వ్యాపారానికి వరలక్ష్మి వ్రతం కొత్త ఊపునిచ్చిందని వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## శ్రీ వేదవల్లీ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

**సత్యవేడు, ఆగస్టు 20,జయ జయహే.**

నాగలాపురంలోని శ్రీ వేదనారాయణ స్వామి దేవాలయంలో వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం శ్రీ వేదవల్లీ అమ్మవారికి పట్టు వస్త్ర సమర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ వేదనారాయణ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు ఎం. జైచంద్రరాజు అమ్మవారి పట్టు వస్త్రాలను ఆలయ అధికారులకు అందజేశారు.ఆలయ అధికారి శ్రీవాసులు, ప్రధాన అర్చకులు శ్రీ నాగరాజా భట్టాచార్య, దేవరాజా భట్టాచార్య పట్టు వస్త్రాలను స్వీకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగలాపురం మండలం జంబుకేశ్వరపురం ఎస్టీ కాలనీలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఎల్లమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శ్రీ వేదనారాయణ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. సమితి అధ్యక్షులు ఎం. జైచంద్రరాజు చేతుల మీదుగా రూ .35,000లు చెక్కును ఆలయ ప్రతినిధులకు అందజేశారు. ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేయడానికి తమ వంతు సహకారం అందిస్తామని సమితి ప్రతినిధులు తెలిపారు.



## ఆలయాలు ప్రజలలో ఆధ్యాత్మికతను పెంచుతాయి

**మాడుగుల ఆగస్టు 20 జయ జయహే**

గ్రామాల్లో ఆలయాలు నిర్మాణం ప్రజల్లో ఐక్యతను ఆధ్యాత్మికతను పెంచుతాయని మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు చెప్పారు. గురువారం మాడుగుల మండలం ఎల్ పొన్నవోలు గ్రామంలో టిటిడి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మంజూరైన 30 లక్షల రూపాయలతో నిర్మించిన రామాలయానికి జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆలయాలను చక్కగా నిర్మించుకొని వాటి నిర్వహణ కూడా బాధ్యతగా చేపట్టి ప్రజల్లో భక్తి భావాన్ని సంస్కృతి సంప్రదాయాలను పెంపొందించాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి వడ్డే రాజ్ కుమార్, స్థానిక నాయకులు ఎర్రంశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# వరలక్ష్మి పూజతో కిట కిటలాడిన మార్కెట్

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి పట్టణ నడిబొడ్డులో గల గాంధీ మార్కెట్ గురువారం జనాలతో కొనుగోలుదారులతో శ్రావణమాసం రెండవ వారం శుక్రవారం వరలక్ష్మీ శుక్రవారం రావడంతో వ్రతం జరుపుకునే మహిళలు స్థానిక ఫ్రూట్స్ పువ్వుల ఇతర పూజా ద్రవ్యాలు అన్ని ఒకచోట దొరికే గాంధీ మార్కెట్ జనాలు పోటెత్తి రావడం జరిగింది. ఏ రోడ్లు చూసిన జనాలతో టూ వీలర్ వెహికల్స్ తో అన్ని రోడ్లు కిటకిట లాడాయి మరొక ప్రక్క తోపుడు బండ్లు, రోడ్ల పైన ఫ్రూట్స్, పూలు మామిడి కొమ్మలు అరటి పిలకలు అరటి ఆకులు చెరుకు గెడలు కుంకుమ, పసుపు అమ్మే వాళ్ళతో రోడ్లన్నీ నిండిపోవడం జరిగింది ఎక్కడ చూసినా కొనుగోలుదారులతో సందడి నెలకొంది ఏవి కొనుగోలు చేద్దామన్న అన్ని ధరలు కొండెక్కి కూర్చున్నాయి చామంతి పూలు పావు కేజీ 150 ₹ కనకంబరాలు మోర 200₹ పూల దండలు 400 నుంచి 600 ₹ అందులో గజమాల పూలదండ 1000 ₹ పావు కేజీ గులాబీ 120₹




కేజీ దానిమ్మ పళ్ళు 300 ₹
కేజీ యాపిల్ 400 ₹
4 బత్తాకాయి400₹

4 మామిడి కొమ్మలు 10₹
ద్రాక్ష కేజీ 160 ₹
2 చెరుకు ముక్కలు 10₹ నిమ్మకాయలు నాలుగు కాయలు 20 రూపాయలు

కొబ్బరికాయలు చిన్న కాయ నుంచి పెద్ద కాయ వరకు 20రూపాయల నుంచి 80 రూపాయల కాయ ధర పలుకుతున్నది

వరలక్ష్మీ వ్రతం పేరు చెప్పి వ్యాపారస్తులందరూ ధరలు పెంచిసి వ్యాపారాలు సాగించారు మహిళలు వరలక్ష్మి పూజ కోసం ఎంత ధర అయినా చెల్లించి కొనుగోలు చేయడం జరిగింది అలాగే బంగారం షాపులు కూడా వరలక్ష్మి బంగారు ప్రతిమ రూపు కొనుగోలుతో కూడా బంగారు షాపులు కలకల్లా డాయి అనకాపల్లి బజార్, మెయిన్ రోడ్డు అంతా జనాలతో ఎక్కడ చూసిన ట్రాఫిక్ నిండిపోయింది పోలీసులు ఎంత కంట్రోల్ చేసిన ఎక్కడ ట్రాఫిక్ క్లియర్ కావడానికి అరగంట పైన ట్రాఫిక్ లో చిక్కుకోవడం వాహనదారులకు చాలా ఇబ్బంది కలిగించింది. మొత్తానికి వరలక్ష్మి వ్రతానికి కొనుగోలుదారులతో అన్ని చోట్ల సందడి నెలకొంది




## జగన్ కీలక హామీతో రాజమండ్రి రూరల్‌లో వైఎస్సార్‌సిపి శ్రేణుల్లో కొత్త ఉత్సాహం

**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్టు 20:**

తాడేపల్లి వైఎస్సార్సీపి కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. మాజీ మంత్రి, రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లిబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, రానున్న ఎన్నికల కార్యాచరణ, కార్యకర్తల పాత్రపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా చెల్లిబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి రాజమండ్రి రూరల్ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, కార్యకర్తల అభిప్రాయాలు, భవిష్యత్ వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం రాజమహేంద్రవరం రూరల్ టౌన్ అధ్యక్షుడు ఎన్.వి. శేఖర్ కూడా జగన్‌ను కలిసి పార్టీ అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ, “రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా చెల్లిబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణనే పార్టీ తరపున ప్రకటిస్తాం. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ సమష్టిగా కృషి చేసి ఆయనను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే, రాష్ట్ర మంత్రివర్గంలో మంత్రి పదవి కల్పించే బాధ్యత నాదే” అని హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వైఎస్సార్‌సిపి శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి. పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని నాయకత్వం పిలుపునిచ్చింది.



## ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ కలెక్టర్

**మాడుగుల ఆగస్టు 20 జయ జయహే**

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర’ కార్యక్రమంలో భాగంగా ఈనెల 22న అనకాపల్లి జిల్లాలో మాడుగుల నియోజకవర్గం పరిధిలో గల కే కోటపాడు మండలం కోడూరు గ్రామాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించనున్నారు. ఈ మేరకు బందోబస్తు ఏర్పాటులను జిల్లా జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం సందర్శించి పరిస్థితి పరిశీలించి అధికారులు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యటన ప్రాంతాలలో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏ ఎస్ ఎల్) నిర్వహించి భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్పీలు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనను అత్యంత ప్రశాంతంగా, విజయవంతంగా ముగించేలా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

**1200 మందితో భారీ పోలీస్ బందోబస్తు:**

ముఖ్యమంత్రి భద్రత నిమిత్తం సుమారు 1200 మంది పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

భద్రతా సిబ్బంది వివరాలు

ముగ్గురు అదనపు ఎస్పీలు, 07 డీఎస్పీలు, 39 సీఐలు, 90 ఎస్ఐలు, 170 ఏఎస్ఐ హెడ్ కానిస్టేబుళ్లు, 400 మంది కానిస్టేబుళ్లు, 146 మంది మహిళా కానిస్టేబుళ్లు, 151 మంది హోమ్ గార్డులు విధులు నిర్వర్తిస్తారు.

బాంబ్ డిస్పోజల్ టీమ్స్, డాగ్ స్క్వాడ్ స్పెషల్ పార్టీలను రంగంలోకి దించారు.

**పర్యటన వివరాలు:**

ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ.కోడూరులోని ఎంపీపీ స్కూల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం ‘స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర’ కార్యక్రమం, ఏ.కోడూరు జడ్పీ హైస్కూల్ పక్కన ‘ప్రజా వేదిక’ సందర్శన, ప్రజా వేదిక సమావేశం, పార్టీ కార్యకర్తలతో సమావేశం మరియు వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొంటారు.

**ఏఎస్ఎల్ సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు:**

అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏ ఎస్ ఎల్) సమీక్షా సమావేశంలో స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ అడిషనల్ డైరెక్టర్ ఎస్.వి.రమణ, ఎస్.ఎస్.ఓ బి.రాజ్ కుమార్, అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, ఆర్డీవోలు వీవీ రమణ, షేక్ ఆయిషా, అనకాపల్లి ఇన్చార్జి డీఎస్పీ జీ.ఆర్.ఆర్.మోహన్, ఉమెన్ పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ శ్రీ కె.రవికుమార్, ఇతర డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు బాల సూర్యారావు, కృష్ణ, అప్పలరాజు, వెంకటనారాయణ, కోటేశ్వరరావు, ప్రేమ కుమార్, అశోక్ కుమార్, స్వామి నాయుడు, గోవిందరావు, ఎస్సై సంతోష్ కుమార్ జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**అధికారులకు ఆదేశాలు:**

విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించకుండా, క్షేత్రస్థాయి అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి. హెలిపాడ్, సభా ప్రాంగణాలు మరియు రోడ్డు మార్గాల్లో నిరంతరం తనిఖీలు నిర్వహించాలి. బాంబ్ స్క్వాడ్ మరియు డాగ్ స్క్వాడ్ బృందాలు పూర్తి అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యమంత్రి గారి పర్యటన ముగిసే వరకు ప్రతి నిమిషం నిఘా పకడ్బందీగా ఉంటుంది” అని అధికారులు స్పష్టం చేశారు.

For a pure tomorrow..
జయహో




# గ్లోబల్ సప్లై చైన్‌లో భారత్

## తయారీ, సేవల మేళవింపుతోనే ఆర్థిక బలం

(ప్రతాప్)

**ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు చుట్టుముడుతున్న వేళ, భారత ఆర్థిక వ్యవస్థ విస్తరణ తదుపరి దశలోకి చేరుకోవడానికి దేశీయ వినియోగంతో పాటు బలమైన ఎగుమతులు, విభిన్న అంతర్జాతీయ మార్కెట్లు, ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు అత్యంత అవసరం. ఒక దేశం ఎంత పరిమాణంలో ఉత్పత్తి చేస్తోందనే దానికంటే, ఆ ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు ఎంత వేగంగా, సమర్థంగా చేర్చగలదన్న అంశమే దాని ఆర్థిక స్థిరత్వాన్ని నిలబెడుతుంది.**

ఈ దిశగా భారతదేశం ఇప్పటికే గణనీయమైన ప్రగతి సాధించింది. 2025--26 ఆర్థిక సంవత్సరంలో వస్తువులు, సేవలు కలిపి మొత్తం ఎగుమతులు రికార్డు స్థాయిలో 863.1 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇందులో వస్తువుల ఎగుమతులు 441.8 బిలియన్ డాలర్లు కాగా, సేవల ఎగుమతులు 421.2 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. భారత ఎగుమతి సామర్థ్యం కేవలం తయారీ రంగానికే పరిమితం కాకుండా, సేవారంగం ఆధారంగా కూడా దృఢంగా నిలదొక్కుకుంటోందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

తదుపరి లక్ష్యం ఎగుమతుల పరిమాణాన్ని పెంచడమే కాకుండా, వాటి విలువను, నాణ్యతను మెరుగుపరచడం కావడం అత్యవసరం. ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలతో పాటు డిజిటల్, ప్రొఫెషనల్ సేవలు దేశానికి విస్తృత అవకాశాలను అందిస్తున్నాయి. మే 2026 నాటికి ఇంజినీరింగ్ వస్తువుల ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 24.48 శాతం పెరిగి 12.31 బిలియన్ డాలర్లకు, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 11.62 శాతం పెరిగి 5.10 బిలియన్ డాలర్లకు చేరడం దేశీయ తయారీ రంగానికి కొత్త ఊపిరి పోస్తోంది.

భారతదేశం కేవలం అసెంబ్లీ కేంద్రంగా మిగిలిపోకుండా డిజైన్, పరిశోధన, ఉత్పాదక భాగాల తయారీ, అధిక విలువ కలిగిన ఉత్పత్తుల హబ్‌గా ఆవిర్భవించాలి. ఫార్మాస్యూటికల్స్‌లో ఏపీఐలు, బయోసిమిలర్లు, వ్యాక్సిన్లు; ఎలక్ట్రానిక్స్‌లో సెమీకండక్టర్లు, పీసీబీలు, బ్యాటరీలు; ఇంజినీరింగ్‌లో ఆధునిక యంత్రాలు, పునరుత్పాదక ఇంధన పరికరాలు వంటి విభాగాల్లో దేశీయ విలువ జోడింపు స్పష్టంగా పెరగాల్సి ఉంది.

ఉపాధి కల్పన దృష్ట్యా టెక్స్‌టైల్స్, ఫుట్‌వేర్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి శ్రమాధారిత రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం దక్కాలి. కోల్డ్‌చేయిన్ నెట్‌వర్క్, ఆధునిక గిడ్డంగులు, ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు, ప్యాకేజింగ్, బ్రాండింగ్ వ్యవస్థలను పటిష్టం చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను అధిక విలువ కలిగిన ఎగుమతులుగా మార్చవచ్చు. ఇది రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరింపజేస్తుంది.

మరోవైపు, డిజిటల్ సేవలు భారతదేశానికి అత్యంత బలమైన ఎగుమతి ఇంజిన్‌గా వ్యవహరిస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్, ఇంజినీరింగ్ డిజైన్, హెల్త్‌కేర్ సేవలను ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచి కూడా ప్రపంచ మార్కెట్లకు అందించే సామర్థ్యాన్ని పెంచాలి. దీనివల్ల ఎగుమతి ఆధారిత ఉద్యోగాలు కొద్దిపాటి మహానగరాలకే పరిమితం కాకుండా నలువైపులా విస్తరిస్తాయి.

అంతర్జాతీయ వాణిజ్య పటిష్టతకు సురక్షితమైన, విభిన్నమైన రవాణా మార్గాలు కీలక ప్రాతిపదిక. 2027లో రష్యాకు భారతదేశం నుంచి తొలి కార్గో నౌకను నార్తర్న్ సీ రూట్ ద్వారా పంపే ప్రతిపాదన వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. సుమారు 5,600 కిలోమీటర్ల ఈ ఆర్కిటిక్ మార్గం సంప్రదాయ సూయజ్ మార్గంతో పోలిస్తే ప్రయాణ సమయాన్ని, దూరాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. అయితే మంచు పరిస్థితులు, ప్రత్యేక నౌకల లభ్యత, బీమా, భౌగోళిక సవాళ్లను సమగ్రంగా సమీక్షించుకోవాలి. ప్రధాన మార్గాలకు పూర్తి ప్రత్యామ్నాయంగా కాకుండా, దీనిని అదనపు వాణిజ్య మార్గంగా మలచుకోవడం శ్రేయస్కరం.

చెన్నై--వ్లాడివోస్టోక్ ఈస్టర్న్ మారిటైమ్ కారిడార్, ఇంటర్నేషనల్ నార్త్--సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు, పోర్ట్--రైలు--రోడ్డు అనుసంధానం, తీరప్రాంత జలరవాణా వ్యవస్థలను ఏకకాలంలో బలోపేతం చేయాలి. ఏదైనా ఒక మార్గంలో ఊహించని అంతరాయం ఎదురైనా ఎగుమతులు స్తంభించకుండా కొనసాగడమే అసలైన ట్రేడ్ రెసిలియెన్స్. పోర్టుల నిర్వహణ సామర్థ్యం, కస్టమ్స్ డిజిటలైజేషన్, రైలు–రోడ్డు అనుసంధానతలు కూడా అంతే కీలకంగా నిలుస్తాయి.

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రపంచ సరఫరా గొలుసుల్లో భాగస్వాములను చేయడం అత్యవసరం. సరళమైన ఎగుమతి విధానాలు, తక్కువ వడ్డీకే వాణిజ్య రుణాలు, సర్టిఫికేషన్ సౌలభ్యం, జిల్లా స్థాయి ఎగుమతి కేంద్రాల విస్తరణ వేగవంతం కావాలి. చిన్న పరిశ్రమలు పెద్ద కంపెనీలకు సరఫరాదారులుగా మారితే దేశీయ తయారీ వ్యవస్థ పునాదులు మరింత బలపడతాయి.

భారత వాణిజ్య భవిష్యత్తు ఒకే ఉత్పత్తి, ఒకే మార్కెట్ లేదా ఒకే రవాణా మార్గంపై ఆధారపడి ఉండకూడదు. అధిక ఉత్పత్తులు, ఎక్కువ విలువ జోడింపు, విస్తృత అంతర్జాతీయ మార్కెట్లు, బహుళ రవాణా మార్గాలు, విస్తారమైన ఉపాధి---ఈ ఐదు సూత్రాల ప్రాతిపదికన రూపొందే ఎగుమతి వ్యవస్థే ప్రపంచ సవాళ్లను తట్టుకుని భారత వృద్ధి ప్రయాణాన్ని వేగవంతం చేస్తుంది. అదే ఆర్థిక స్వావలంబనకు నిజమైన పునాది.



# 2036 నాటికి 20 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా భారత్

(సి. హెచ్.ప్రతాప్)

**భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునే కీలక దశలో ఉంది. 2026 నాటికి సుమారు 4 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకున్న భారత ఆర్థిక వ్యవస్థకు, వచ్చే దశాబ్దంలో మరింత వేగంగా విస్తరించే అవకాశాలు ఉన్నాయి. ఎక్స్వైరస్ విశ్లేషణ ప్రకారం అవసరమైన సంస్కరణలు, అధిక ఉత్పాదకత, పెట్టుబడులు, సేవారంగ విస్తరణ, బలమైన ఎగుమతులు, రూపాయి విలువలో స్థిరమైన మెరుగుదల సాధ్యమైతే 2036 నాటికి భారత్ 20 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగవచ్చు. ఇది కేవలం ఆర్థిక లక్ష్యం కాకుండా, వచ్చే పదేళ్లలో దేశ సామర్థ్యాలను విస్తృతంగా వినియోగించుకునే అవకాశంగా చూడాలి.**



2025--26లో భారత వాస్తవ జీడీపీ 7.7 శాతం వృద్ధి చెందగా, ప్రస్తుత ధరల వద్ద నామమాత్ర జీడీపీ ₹346.36 లక్షల కోట్లకు చేరింది. అంటే భారత్ ఇప్పటికే బలమైన వృద్ధి దశలో ఉంది. అయితే సుమారు 4 ట్రిలియన్ డాలర్ల స్థాయి నుంచి 20 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలంటే ఆర్థిక వ్యవస్థను దాదాపు ఐదింతలు విస్తరించాలి. ఎక్స్వైరస్ అంచనా ప్రకారం రూపాయి పరంగా సుమారు 14.2 శాతం వార్షిక వృద్ధి, అలాగే సంవత్సరానికి 3--3.6 శాతం మేర రూపాయి విలువలో మెరుగుదల అవసరం. ఇది డాలర్ పరంగా దాదాపు 18 శాతం నామమాత్ర వృద్ధిని సూచిస్తుంది.




ఈ ప్రయాణంలో సేవారంగం ప్రధాన వృద్ధి ఇంజిన్‌గా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం జీడీపీలో సుమారు 54 శాతం వాటా కలిగిన సేవారంగం భవిష్యత్తులో 65 శాతానికి పైగా పెరగవచ్చని ఎక్స్వైరస్ అంచనా వేస్తోంది. ఐటీ, కృత్రిమ మేధస్సు, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్, ఆరోగ్య సేవలు, విద్యా సాంకేతికత, డిజైన్, పరిశోధన వంటి అధిక విలువ కలిగిన రంగాల్లో భారత సామర్థ్యాన్ని ప్రపంచ మార్కెట్లకు విస్తరించాలి.

గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు కూడా కీలక అవకాశంగా మారుతున్నాయి. ఇవి కేవలం బ్యాక్‌ఆఫీస్ కేంద్రాలుగా కాకుండా కృఇతిమమేధ , పరిశోధన, ఇంజినీరింగ్, ఉత్పత్తి అభివృద్ధి, డిజిటల్ పరివర్తనకు కేంద్రాలుగా మారితే అధిక విలువ కలిగిన సేవల ఎగుమతులు పెరుగుతాయి. ఘ్శ్ము సంఖ్యను 5,000కు పెంచే అవకాశాన్ని ఎక్స్వైరస్ గుర్తించింది.

అదే సమయంలో తయారీ రంగం వేగం పుంజుకోవాలి. ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఔషధాలు, ఆటోమొబైల్స్, యంత్రసామగ్రి, రసాయనాలు, పునరుత్పాదక ఇంధన పరికరాలు, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాల్లో ప్రపంచ సరఫరా గొలుసులతో భారత పరిశ్రమలను అనుసంధానించడం ద్వారా ఉత్పత్తి, ఎగుమతులు, ఉపాధి పెరగవచ్చు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పెద్ద పరిశ్రమల సరఫరా గొలుసులతో అనుసంధానం చేయడం ఈ ప్రయోజనాలను విస్తృతం చేస్తుంది.

వ్యవసాయంలో విలువ ఆధారిత వృద్ధి మరో పెద్ద అవకాశం. పంట ఉత్పత్తితో పాటు సైలోలు, ఆధునిక గిడ్డంగులు, కోల్డ్ చైన్లు, ఆహార ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, బ్రాండింగ్, వ్యవసాయ ఎగుమతులను అభివృద్ధి చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మరింత విలువ సృష్టించవచ్చు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, డిజిటల్ మార్కెట్లు, ఆధునిక లాజిస్టిక్స్ దీనికి తోడ్పడగలవు.

ఈ ఆర్థిక విస్తరణకు మౌలిక వసతులు వెన్నెముక. రహదారులు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలతో పాటు విద్యుత్, నీరు, గిడ్డంగులు, పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్, డిజిటల్ కనెక్టివిటీ సమన్వయంతో అభివృద్ధి చెందాలి. ముఖ్యంగా పోర్టు--రైల్వే--పరిశ్రమ అనుసంధానం మెరుగుపడితే రవాణా వ్యయం తగ్గి భారత ఉత్పత్తుల పోటీ సామర్థ్యం పెరుగుతుంది.

మానవ మూలధనం ఈ ప్రయాణానికి అసలు బలం. పాఠశాల విద్యలో పునాది నైపుణ్యాలు, ఉన్నత విద్యలో పరిశోధన, వృత్తి విద్యలో పరిశ్రమ ఆధారిత శిక్షణ, ఆఈ, రోబోటిక్స్, సెమీకండక్టర్లు, బయోటెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో నైపుణ్యాభివృద్ధి అవసరం. మహిళల శ్రామిక భాగస్వామ్యాన్ని పెంచడం కూడా దేశ ఉత్పాదక సామర్థ్యాన్ని విస్తరించగలదు.

పెట్టుబడులు, ఎగుమతులు కూడా సమానంగా కీలకం. ప్రభుత్వ మూలధన వ్యయంతో పాటు ప్రైవేట్, విదేశీ పెట్టుబడులు, పెన్షన్, బీమా నిధులు, కార్పొరేట్ బాండ్ మార్కెట్ వంటి దీర్ఘకాలిక మూలధన వనరులను మరింత సమర్థంగా వినియోగించాలి. ప్రపంచ మార్కెట్లలో భారతీయ ఉత్పత్తులు, సేవల వాటా పెరగాలంటే నాణ్యత, పోటీ ధరలు, వేగవంతమైన లాజిస్టిక్స్, స్థిరమైన సరఫరా గొలుసులు అవసరం.

నగరీకరణ, ఇంధన రంగం కూడా కొత్త అవకాశాలను తెరుస్తాయి. టైర్–2, టైర్–3 నగరాలను కొత్త ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం ద్వారా వృద్ధిని విస్తృత ప్రాంతాలకు తీసుకెళ్లవచ్చు. సౌర, పవన, జల, అణు విద్యుత్, బ్యాటరీ నిల్వ, గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాల్లో పెట్టుబడులు పెరగడం ద్వారా పారిశ్రామిక వృద్ధికి అవసరమైన ఇంధన భద్రతను బలోపేతం చేయవచ్చు.

2026ను 2036తో పోలిస్తే ప్రయాణం స్పష్టంగా కనిపిస్తుంది. 2026లో భారత్ సుమారు 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 7.7 శాతం వాస్తవ ఘ్డ్ము వృద్ధి, భారీ దేశీయ మార్కెట్, యువ మానవ వనరులు, బలమైన డిజిటల్ సామర్థ్యంతో ఉన్న దేశం. 2036 లక్ష్యం 20 ట్రిలియన్ డాలర్ల స్థాయి---అంటే దాదాపు ఐదింతల ఆర్థిక విస్తరణ. అందుకోసం ప్రస్తుత వృద్ధి వేగాన్ని కొనసాగించడంతో పాటు ఉత్పాదకత, ఉపాధి, పెట్టుబడులు, ఎగుమతులు, ఆవిష్కరణలను మరింత వేగవంతం చేయాలి.

అంతిమంగా 20 ట్రిలియన్ డాలర్లు కేవలం జిడిపి సంఖ్య కాదు. అది భారతదేశం తన యువ జనాభాను నైపుణ్యవంతమైన మానవ మూలధనంగా, సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచ అవకాశంగా, దేశీయ మార్కెట్‌ను ఉత్పత్తి--సేవల కేంద్రంగా మార్చుకునే సామర్థ్యానికి ఒక కొలమానం. 2026 బలమైన పునాది అయితే, 2036 ఆ పునాదిపై నిర్మించాల్సిన తదుపరి ఆర్థిక శిఖరం. వేగం, ఉత్పాదకత, నైపుణ్యం, ఆవిష్కరణ, పెట్టుబడి, ఎగుమతులు, సమగ్ర అభివృద్ధి సమన్వయంగా ముందుకు సాగితే 20 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం భారత ఆర్థిక సామర్థ్యాన్ని ప్రపంచ స్థాయిలో మరింత విస్తరించే శక్తివంతమైన దిశానిర్దేశకంగా మారుతుంది.

# కృత్రిమ మేధతో బ్యాంకింగ్‌లో కొత్త ఉద్యోగ యుగం

(ప్రతాప్)

**బ్యాంకింగ్ రంగంలో కృత్రిమ మేధ వేగంగా ప్రవేశిస్తోంది. ఖాతాదారుల సందేహాలకు సమాధానాలు ఇవ్వడం నుంచి రుణ దరఖాస్తుల పరిశీలన, మోసాల గుర్తింపు, ప్రమాదాల అంచనా, వ్యక్తిగత ఆర్థిక సేవల సూచనల వరకు సాంకేతికత వినియోగం విస్తరిస్తోంది. దీంతో "కృత్రిమ మేధ వస్తే బ్యాంకు ఉద్యోగాలు తగ్గిపోతాయా?" అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. అయితే ప్రస్తుత పరిణామాలను పరిశీలిస్తే సాంకేతికత ఉద్యోగాలను పూర్తిగా తొలగించడం కంటే ఉద్యోగాల స్వరూపాన్ని మార్చే అవకాశం ఎక్కువగా ఉంది.**



భారతదేశ బ్యాంకింగ్ వ్యవస్థ ఇప్పటికే భారీ స్థాయిలో డిజిటల్‌గా మారింది. యూపీఐ ద్వారా 2025లో నెలకు సగటున 2,000 కోట్లకు పైగా లావాదేవీలు జరిగే స్థాయికి డిజిటల్ చెల్లింపులు చేరాయి. ఈ డిజిటల్ విస్తరణపై కృత్రిమ మేధ మరో శక్తివంతమైన పొరను జోడిస్తోంది. సాధారణ, పునరావృత పనులను యంత్రాలు నిర్వహిస్తే, ఉద్యోగులు సంక్లిష్టమైన నిర్ణయాలు, ఖాతాదారులతో సంబంధాలు, ఆర్థిక సలహాలు వంటి విలువను జోడించే పనులపై ఎక్కువ సమయం కేటాయించవచ్చు.

ఉదాహరణకు, ఖాతా వివరాల సేకరణ, పత్రాల పరిశీలన, సాధారణ ప్రశ్నలకు సమాధానాలు, అనుమానాస్పద లావాదేవీల గుర్తింపు వంటి పనులను కృత్రిమ మేధ వేగంగా నిర్వహించగలదు. రుణాల విషయంలోనూ వేలాది సమాచార అంశాలను విశ్లేషించి రుణగ్రహీత ఆర్థిక సామర్థ్యం, తిరిగి చెల్లించే అవకాశాలు, సంభావ్య ప్రమాదాలను అంచనా వేయడంలో సహాయపడుతుంది. అయితే తుది నిర్ణయాల్లో మానవ పర్యవేక్షణ తప్పనిసరి. ఎందుకంటే ప్రతి ఖాతాదారుడి పరిస్థితిని కేవలం గణాంకాలతో అంచనా వేయలేం.

ఇదే భవిష్యత్ బ్యాంకు ఉద్యోగి పాత్రను మార్చబోతోంది. లావాదేవీలు నమోదు చేయడం, పత్రాలు పరిశీలించడం వంటి సంప్రదాయ పనులతో పాటు సమాచార విశ్లేషణ, డిజిటల్ సాధనాల వినియోగం, సైబర్ భద్రత, కృత్రిమ మేధ ఫలితాలను పరిశీలించే సామర్థ్యం, ఖాతాదారులతో సమర్థవంతమైన సంభాషణ వంటి నైపుణ్యాలు కీలకంగా మారతాయి. ఒక ఉద్యోగి యంత్రంతో పోటీ పడాల్సిన అవసరం లేదు; యంత్రాన్ని సమర్థంగా ఉపయోగించగలిగే ఉద్యోగిగా మారాలి.

ఇది బ్యాంకు ఉద్యోగులకు నిరంతర నైపుణ్యాభివృద్ధిని తప్పనిసరి చేస్తుంది. ఒకసారి నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానంతో జీవితాంతం పనిచేసే రోజులు తగ్గిపోతున్నాయి. బ్యాంకులు కూడా ఉద్యోగులకు పునఃశిక్షణ, కొత్త నైపుణ్యాల అభివృద్ధి, సాంకేతిక సాధనాలపై నిరంతర శిక్షణ అందించాలి. అదే సమయంలో అనుభవజ్ఞులైన ఉద్యోగుల మానవ సంబంధ నైపుణ్యాలను సాంకేతికతతో సమన్వయం చేయడం మరింత ప్రయోజనకరం.

అయితే కృత్రిమ మేధతో కొత్త సవాళ్లు కూడా వస్తాయి. వ్యక్తిగత సమాచార గోప్యత, సైబర్ దాడులు, తప్పు సమాచారంపై ఆధారపడే నిర్ణయాలు, అల్గారిథమ్‌లలో పక్షపాతం వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయలేం. అందువల్ల సాంకేతికతకు తోడు పారదర్శకత, మానవ పర్యవేక్షణ, బాధ్యతాయుతమైన సమాచార వినియోగం, బలమైన భద్రతా వ్యవస్థలు అవసరం.

రేపటి బ్యాంకింగ్‌లో అసలు ప్రశ్న "ఎన్ని ఉద్యోగాలు మిగులుతాయి?" అనేది కాదు. "మనుషులు--సాంకేతికత కలిసి ఎంత మెరుగైన బ్యాంకింగ్ సేవ అందించగలరు?" అన్నదే. యంత్రాలు వేగాన్ని, విశ్లేషణ సామర్థ్యాన్ని అందిస్తే, మనుషులు వివేచన, అనుభవం, విశ్వాసం, మానవీయతను అందించాలి.

కృత్రిమ మేధ ఉద్యోగాలను అంతం చేసే శక్తిగా కాకుండా, ఉద్యోగాలను కొత్త రూపంలో తీర్చిదిద్దే శక్తిగా మారాలి. భారతీయ బ్యాంకింగ్ భవిష్యత్తు యంత్రాలదీ కాదు, మనుషులదీ కాదు---ఇద్దరి సమర్థ సమన్వయానిదే..

# బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

## టీటీడీ సమన్వయ సమావేశంలో టీటీడీ ఈవో

**తిరుమల,ఆగస్ట్ 20,జయ జయహే.**

ఈ ఏడాది అధిక మాసం కారణంగా తిరుమలలో రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండటంతో జిల్లా, పోలీసులు, టీటీడీ అధికారులు సమన్వయంతో పని చేసి కట్టుదిట్టమైన ప్రణాళికలతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర కోరారు. గురువారం తిరుమలలోని అన్నమయ్య భవన్ లో శ్రీవారి బ్రహ్మోత్సవాలపై అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి,జిల్లా కలెక్టర్ డాక్టర్ వేంకటేశ్వర్, ఎస్పీ సుబ్బారాయుడులతో కలిసి ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. టీటీడీ బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై అదనపు ఈఓ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నాణ్యతలో రాజీ పడకుండా రుచికరమైన అన్న ప్రసాదాలను తయారు చేసి భక్తులకు పంపిణీ చేయాలన్నారు. భక్తుల భద్రతకు ఎలాంటి సమస్య తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు 10 లక్షల లడ్డులను బఫర్ స్టాక్ గా పెట్టుకోవాలని చెప్పారు. గరుడ వాహనం రోజున భక్తులకు దర్శనం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అందుకు తగిన విధంగా ఆర్టీసీ బస్సులను నడిపేలా ఏర్పాట్లు చేయాలన్నారు. స్వామివారికి నిస్వార్థంగా సేవలందించే శ్రీవారి సేవకులను గుర్తించివారిసేవలనుబ్రహ్మోత్సవాలకు వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం ఈవో అధికారులతో కలిసి శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధులను తనిఖీ చేసి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీల అనంతరం టీటీడీ అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్, ఎస్పీ, సీవీఎస్వో మురళీకృష్ణలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ ఏటా తిరుమలకు పెరుగుతున్న భక్తుల సంఖ్య, ఇటీవల రథసప్తమి సందర్భంగా సుమారు 3.75 లక్షల మంది భక్తులు రావడం, రాబోయే బ్రహ్మోత్సవాల్లో భక్తుల రద్దీపై ముందస్తు అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. తిరుమల, తిరుపతి ప్రాంతాల్లో భక్తుల రద్దీ, వాహన ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌తో పాటు ఆరోగ్యం, పారిశుద్ధ్యం, అన్నప్రసాదం, ఘాట్‌రోడ్ల నిర్వహణ, అత్యవసర పరిస్థితుల నిర్వహణ తదితర అంశాలపై



సమీక్షించినట్లు వివరించారు. ముఖ్యంగా గరుడసేవకు అధిక ప్రాధాన్యతనిస్తూ, తిరుమలతో పాటు తిరుపతిలోనూ భక్తుల రాద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. గత బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ రోజున సుమారు 20 లక్షల ఫుడ్ పోర్షన్లు, వివిధ రకాల పానీయాలతో పాటు 15 రకాల మెనూలను భక్తులకు అందించినట్లు తెలిపారు. ఈ ఏడాది భక్తుల రద్దీకి అనుగుణంగా అదనపు వంటశాలల ఏర్పాటుతోపాటు అవసరమైన నిత్యావసర సరుకుల సేకరణ, రవాణా ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో విపత్తు, సంక్షోభ నిర్వహణ, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటుపై చర్చించినట్లు తెలిపారు. పోలీసు శాఖ తరపున అవసరమైన సిబ్బంది నియామకం, వారికి వసతి, విధుల కేటాయింపుపై ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. టీటీడీ విజిలెన్స్ విభాగం, సీవీఎస్వో ఆధ్వర్యంలో గత అనుభవాలను పరిగణలోకి తీసుకుని భద్రతా సిబ్బంది మోహరింపుపై నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించారు. బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ దేశంలోని 25 రాష్ట్రాల నుంచి 27 కళాబృందాలు పాల్గొననున్నాయని, ఇందులో రెండు విదేశీ కళాబృందాలు కూడా ఉన్నాయని తెలిపారు. ఎస్వీబీసీ, సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా బ్రహ్మోత్సవాల విశేషాలను కోట్లాది మంది భక్తులకు చేరేలా విస్తృత ప్రచార ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. అన్ని శాఖలు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, పరస్పరం సమన్వయం చేసుకుని ఒకే బృందంగా పనిచేయడం ద్వారా బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు ఈవో తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవోలు డాక్టర్ శరత్, ప్రభల గోపీనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం: మేడవరపు భద్రం దొర

**నిడదవోలు జయ జయ ప్రతినిధి:**

మహానేత, భారతదేశ మాజీ ప్రధానమంత్రి, అతిపిన్న వయసులో ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన శ్రీ రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా నిడదవోలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ మేడవరపు భద్రం దొర పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేడవరపు భద్రం దొర మాట్లాడుతూ.. దేశంలో ఆధునిక సాంకేతికతకు పునాదులు వేసిన మహానేత రాజీవ్‌గాంధీ సేవలను ఎన్నటికీ మరువలేమన్నారు. 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. ప్రస్తుతం దేశంలో హింస, మతోన్మాదం, అవినీతి పెరిగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజలకు భద్రత, దేశానికి రక్షణ కల్పించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను కాపాడటం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు చిన్నం మురళీకృష్ణ, జిల్లా ఎస్టీ విభాగం అధ్యక్షులు బండి అభి, పట్టణ ఎస్సీ విభాగం అధ్యక్షులు పుచ్చకాయల వరప్రసాద్, నియోజకవర్గ ఎస్సీ విభాగం చైర్మన్ కాకి కిషోర్, కళ్లెం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా దుర్గాలమ్మ మాత అమ్మవారి పండగ

**మునగపాక, ఆగస్టు 20 జయ జయహే**

మునగపాక, మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో దర్గాలమ్మ మాత అమ్మవారి పండగను గురువారం గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ పండగ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ కృష్ణంరాజు కాలువ డైరెక్టర్ పచ్చికూరు నర్సింగరావు టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు వెంకటరమణ జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు దొడ్డి భాస్కరరావు ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షులు మల్ల స్వామి మల్ల వెంకట రామారావు తదితరులు ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు పుచ్చు కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో కోయిరాడు సూరిబాబు కార్యదర్శి ఆధ్వర్యంలో పండగను ఘనంగా నిర్వహించారు

# దేశాన్ని మలుపుతిప్పిన దార్శనికుడు రాజీవ్‌గాంధీ

## ఘనంగా నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్టు 20**

దేశాన్ని ఆధునిక ప్రగతి పథంలో నడిపించిన దార్శనికుడు, మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ రాజమండ్రి పార్లమెంట్ కో-ఆర్డినేటర్ టికె విశ్వేశ్వరరెడ్డి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. రాజీవ్‌గాంధీ 82వ జయంతిని పురస్కరించుకుని సీతంపేట పార్కులోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగానివాళు లర్పించారు. ఈ సందర్భంగా టీకే విశ్వేశ్వరరెడ్డి, బాలేపల్లి మురళీధర్ మాట్లాడుతూ.. దేశంలో శాస్త్ర, సాంకేతిక రంగాలకు రాజీవ్‌గాంధీ విశేష ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. యువతను ప్రోత్సహించేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నారని, 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం, కంప్యూటర్ రంగాన్ని విస్తృతంగా ప్రోత్సహించడం దేశ దేశ ప్రగతిలో మైలురాళ్లుగా నిలిచాయని పేర్కొన్నారు. 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకు అధిక ప్రాధాన్యత కల్పించి గ్రామీణాభివృద్ధికి బాటలు వేశారని





తెలిపారు. రాజీవ్‌గాంధీకి రాజమహేంద్రవరం నగరంతో ప్రత్యేక అనుబంధం ఉందని టీకే విశ్వేశ్వరరెడ్డి గుర్తుచేశారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగకపోవడం వల్ల ప్రజలకు అందాల్సిన నిధులు, అభివృద్ధి అవకాశాలు దెబ్బతింటాయని నాయకులు అన్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించకుండా నిధుల వినియోగంపై కుట్ర జరుగుతోందని టికె విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. ఎన్నికలు నిర్వహించి ప్రజా ప్రతినిధులను అందుబాటులోకి తీసుకువస్తే అన్ని డివిజన్ల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెద్దఎత్తున నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్నికల అంశంపై న్యాయపోరాటం చేస్తానని వెల్లడించారు. అనంతరం పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, బెజవాడ రంగారావు, డాక్టర్ రాజశేఖర్, బత్తిన చంద్రరావు, సాకా పుల్లారావు, తాడి సూరిబాబు, బర్రే సుబ్రహ్మణ్యం, నిల్లా వీర్రాజు, సింధియా రాణి, ఆలీ, జయలక్ష్మి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## ప్లాస్టిక్‌కు నో.. పర్యావరణానికి హై

### విద్యార్థులతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రతిజ్ఞ

**రాజమహేంద్రవరం: జయ జయహే : ఆగస్టు 20**

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మోరంపూడి సిటీ స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రైమరీ అండ్ హైస్కూల్‌లో నిర్వహించిన 'సే నో టూ ప్లాస్టిక్' కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువల్లో పేరుకుపోవడం వల్ల మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడటంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని తెలిపారు. ప్లాస్టిక్ భూమిలో కలిసిపోవడానికి ఎక్కువ కాలం పడుతుందని, అందువల్ల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా తగ్గించి గుడ్డ సంచులు, పునర్వినియోగ వస్తువులను వినియోగించాలని సూచించారు. విద్యార్థులు తమ ఇళ్లలోనూ, పరిసర ప్రాంతాల్లోనూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. పరిశుభ్రమైన నగరం, ఆరోగ్యకరమైన సమాజం కోసం పారిశుద్ధ్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్లాస్టిక్ వినియోగ నియంత్రణకు ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు సహకరించాలని కోరారు. అనంతరం ప్లాస్టిక్ రీయూస్ కోసం రూపొందించిన పలు ప్రయోగాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ రాహుల్ మీనా తిలకించారు. 'ప్లాస్టిక్‌కు నో చెబుతాం.. పర్యావరణాన్ని కాపాడుతాం' అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, నగరపాలక సంస్థ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఏఈ కుటుంబ ఆత్మహత్యల కేసులో నిందితుడికి కఠిన శిక్ష విధించాలి:

### పిక్కి నాగేంద్ర

**రాజమహేంద్రవరం: జయ జయహే**

ఆగస్టు 20: పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్యలు అత్యంత విషాదకరమని, ఈ ఘటనకు కారణమైన షేక్ సాదిక్ ఖాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర డిమాండ్ చేశారు. కొవ్వూరు బిజెపి కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసు, న్యాయవ్యవస్థను కోరారు. సమాజంలో ఎవరైనా వేధింపులకు గురైతే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగకపోయినా, భయపెట్టినా వెంటనే బీజేపీ జనతా వారధిని సంప్రదించాలని, బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, కొవ్వూరు పట్టణ అధ్యక్షుడు చెరుకూరి సాయి రామకృష్ణంరాజు, కొవ్వూరు రూరల్ మండల అధ్యక్షురాలు దేగల సునీత, మడిచర్ల రామచంద్రరావు, గెల్లా కేశవ, ఆలపాటి రామకృష్ణ, బాధరాల ఉమామహేశ్వరరావు, బెల్లపుకొండ మణికంఠ, సుబ్బారెడ్డి, దొమ్మేరు అనిల్ కుమార్, ఓసిపల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## పోలీసుల తనిఖీలు

### అక్రమ రవాణాపై మంప ఎస్ఐ శ్రీనివాస్ ఉక్కుపాదం..

**కొయ్యూరు : (జయ జయహే ) న్యూస్ ఆగష్టు 21,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం, మంప పోలీస్ స్టేషన్ పరిధిలోని కీలకమైన నడింపాలెం జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ఏజెన్సీ ప్రాంతం మీదుగా తరచుగా జరుగుతున్న గంజాయి, మద్యం మరియు ఇతర చట్టవ్యతిరేక అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా ఈ విస్తృత తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అనుమానాస్పదంగా వస్తున్న ప్రతి కారు, ఆటో, ద్విచక్ర వాహనాలను ఆపి పోలీసులు అణువణువూ తనిఖీ చేస్తున్నారు. ప్రయాణికుల గుర్తింపు కార్డులు, వాహనాల ఆర్ సీ, లైసెన్స్ మరియు ఇతర పత్రాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. సరైన పత్రాలు లేకుండా ప్రయాణించే వారిపై, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని మంప ఎస్ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీలతో నడింపాలెం జంక్షన్ మరియు దాని పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా వాతావరణం నెలకొంది.

# స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు నియోజకవర్గ స్థాయి శిక్షణ

**స్వర్ణ అరకు, ఆగస్టు 20 జయ జయహే**



స్వర్ణాంధ్ర--2047 లక్ష్యాల సాధనలో భాగంగా జిల్లా కలక్టర్ టీ నిశాంతి ఆదేశాలకు అనుగుణంగా స్వర్ణ అరకు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులకు కాన్స్టిట్యుయెన్సీ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం సామర్థ్య నిర్మాణ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పాలే ఇండియా ఫౌండేషన్ స్టేట్ ప్లానింగ్ డిపార్ట్మెంట్ సహకారంతో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ డాక్టర్ మానవ్ ఆధ్వర్యంలో టీమ్ నవీన్,అమర్జిత్ ఉపేంద్ర పాల్గొని, స్వర్ణ అరకు నియోజకవర్గంలోని అన్ని రంగాలకు చెందిన మండల స్థాయి అధికారులకు అభివృద్ధి ప్రణాళిక, ఆర్థిక అభివృద్ధి, డేటా ఆధారిత ప్రణాళికపై సామర్థ్యాన్ని పెంపొందించేలా శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ పాల్గొని, నియోజకవర్గ స్థాయిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం మరియు స్వర్ణాంధ్ర--2047 లక్ష్యాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయడం వంటి అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు.

శిక్షణలో ప్రధానంగా జి విఏ, జి ఎస్ డి పి, డి, ఏం డి పి, వంటి ముఖ్యమైన ఆర్థిక అభివృద్ధి సూచికలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఒక మండలం, జిల్లా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో వివిధ రంగాల వాటా, ఆయా రంగాల్లో ఉత్పాదకతను పెంచడం ద్వారా జి వి ఏను ఎలా పెంచాలి, జి వి ఏ. పెరుగుదల ద్వారా జి ఎస్ డి పి, డిడిపి, ఎండిపి వృద్ధికి ఎలా దోహదపడాలి అనే అంశాలను వివరించారు. అలాగే మండల స్థాయిలో అందుబాటులో ఉన్న సహజ వనరులు, వ్యవసాయ వనరులు, మానవ వనరులు, పారిశ్రామిక అవకాశాలు మరియు సేవా రంగాన్ని గుర్తించి, వాటి ఆధారంగా ఎం డి పి ను పెంచే విధంగా స్థానిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరాన్ని వివరించారు.

**తలసరి ఆదాయం పెంపుపై దృష్టి**

స్వర్ణాంధ్ర--2047 లక్ష్యాలలో భాగంగా కేవలం మౌలిక వసతుల అభివృద్ధి మాత్రమే కాకుండా ప్రజల ఆదాయం జీవన ప్రమాణాలను పెంచడం ప్రధాన లక్ష్యమని శిక్షణలో వివరించారు.

స్థానికంగా అధిక విలువ కలిగిన వ్యవసాయం, ఉద్యాన పంటలు, ఆహార శుద్ధి విలువ ఆధారిత ఉత్పత్తులు, ఎమ్మెస్ ఎంఈ లు, పరిశ్రమలు, సేవా రంగం, నైపుణ్యాభివృద్ధి ఉపాధి అవకాశాలను పెంచడం ద్వారా జి వి ఏతో పాటు ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచే విధానాలపై అధికారులకు అవగాహన కల్పించారు.

**డేటా ఆధారిత అభివృద్ధి ప్రణాళిక**

ప్రతి మండలానికి సంబంధించిన ఆర్థిక, సామాజిక రంగాల వారీ డేటాను విశ్లేషించి, అందుబాటులో ఉన్న వనరులు అభివృద్ధి అవకాశాలను గుర్తించి డేటా ఆధారిత మండల అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు, విద్య, వైద్యం, మౌలిక వసతులు, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి ఫలితాలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. స్థానిక వనరుల సమర్థ వినియోగం -- అధిక ఉత్పాదకత -- అధిక తలసరి ఆదాయం" అనే విధానంతో పనిచేస్తే స్వర్ణాంధ్ర--2047 లక్ష్యాల సాధనలో స్వర్ణ అరకు నియోజకవర్గం గణనీయమైన పురోగతి సాధించగలదని కార్యక్రమంలో పేర్కొన్నారు. ఈ సామర్థ్య నిర్మాణ శిక్షణ ద్వారా స్వర్ణ అరకు నియోజకవర్గంలోని వివిధ శాఖల మండల స్థాయి అధికారులకు స్వర్ణాంధ్ర--2047 విజన్, ఆర్థిక అభివృద్ధి సూచికలు డేటా ఆధారిత ప్రణాళిక ప్రజల తలసరి ఆదాయం పెంపు వంటి అంశాలపై అవగాహన మరియు సామర్థ్యం పెంపొందించబడింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ బి నీలకంఠరావు , అరకు ఏవో పి వీరభద్రరావు , యంగ్ ప్రొఫెషనల్ డి శ్రీనివాసు , సీవిఏపీ బృందం మండలాధికారులు పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యుత్ సహకార సంస్థల సమస్యలు పరిష్కరించాలి కొణతాల

**జయ జయహే.**



గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ విద్యుత్ సహకార సంస్థల్లో దశాబ్దాలుగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన శాసనసభలో కోరడం జరిగింది జీరో అవర్లో ఆయన మాట్లాడుతూ 1974 గ్రామీణ గ్రామీణ విద్యుత్కరణలో భాగంగా ఏర్పాటైన విద్యుత్ సహకార సంస్థలు ఎంతో విజయవంతంగా పని చేశాయని ప్రస్తుత అది విద్యుత్ బోర్డు పరిధిలోకి బదలాయింపు అవుతున్న సందర్భంలో ఉద్యోగ ప్రాథమిక హక్కులు వేతనాలు సంక్షేమ సదుపాయాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు 20 30 సంవత్సరాల సేవలందిస్తున్న ఉద్యోగులకు తగిన జీతాలు అందడం లేదని సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ అవి పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని పిఎఫ్ చెల్లింపులను నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అంశాలపై విచారణ జరిపి భాగ్యలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరడం జరిగింది అదేవిధంగా ఉద్యోగులకు హెల్త్ యాక్సిడెంట్ ఇన్స్యూరెన్స్ సదుపాయాలు కొనసాగించాలని బీమా లేకపోవడం వల్ల ఉద్యోగుల ప్రమాదాలు గురైనప్పుడు వారి కుటుంబాలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని ఆయన తెలియజేస్తూ వాటిని పునరుద్ధరించాలని కోఆపరేటివ్ అర్ ఈ సి ఎస్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న పాలిటెక్నిక్ కళాశాల కూడా ప్రభుత్వ తగిన నిధులు కేటాయించాలని ఆయన కోరడం జరిగింది . సంస్థకు వచ్చిన లాభాలను ప్రతి ఏడాది రెండు కోట్లు కళాశాల నిర్వహణ కేటాయించి సిబ్బంది జీతాలు ఉపాధ్యాయులు మరియు సిబ్బంది నియామకాలు చేపట్టాలని వారు సూచించారు పాలిటెక్నిక్ సంబంధించిన సుమారు 112 కోట్ల ఆస్తులు విషయంలో విద్యుత్ బోర్డు సహకార శాఖల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించి ఆశ్చర్య శాఖ పరిధిలో ఉండాలని దానిపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు కళాశాల సహకార సంస్థల నిర్వహించలేని పరిస్థితి ఉంటే ట్రాన్స్కో ఆదరిలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఉద్యోగుల వేతనాలు పిఎఫ్ బీమా పాలిటెక్నిక్ కళాశాల నిర్వహణ ఆస్తుల బదలాయింపు అంశాలపై సంబంధిత శాఖలలో స్పష్టమైన చర్యలు తీసుకుని సమస్యల పై శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది



## పట్టణ నిరాశ్రయులకు అన్న సేవ

**విజయనగరం, ఆగస్టు 20: (జయ జయహే )**

పద్మభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా విజయనగరం జిల్లా చిరంజీవి యువత, విజయనగరం జిల్లా మెగా యూత్ ఫోర్స్ మరియు అంజనీపుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం అండ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయులకు అన్న సేవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

విజయనగరం ఫైర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి అందించారు.

ఈ కార్యక్రమాన్ని జనసేన యువ నాయకుడు, మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొయ్యాన లక్ష్మణ్ యాదవ్, విజయనగరం జిల్లా మెగా యూత్ ఫోర్స్ అధ్యక్షుడు చెల్లూరి ముత్యాల నాయుడు, అంజనీపుత్ర చిరంజీవి ప్రజా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు లోపింటి కళ్యాణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా మెగా యూత్ ఫోర్స్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొయ్యాన లక్ష్మణ్ యాదవ్ మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం, నిరాశ్రయులకు అండగా నిలవడం ఎంతో గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. చిరంజీవి గారి సేవా స్ఫూర్తితో మెగా అభిమానులు నిరంతరం ప్రజా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని, భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మెగా ఫ్యామిలీ ప్రతినిధులు కొర్నాన శ్రీకాంత్, జె. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు

## విద్యా రంగ పరిరక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి

**అనకాపల్లి జయ జయహే**




విద్యారంగం పరిరక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని విద్యార్థులు సమస్యలను పరిష్కరించకుండా మి న్నకుంటే ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం అని ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు పిలుపునిచ్చారు రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్ భారీ ర్యాలీ నిర్వహించే నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో భాగంగా ఏఐఎస్ఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బి బాబ్జి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చలగాటమాడుతున్నాయని ఆయన విమర్శించారు విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన వసతి గృహాలకు తగినన్ని నిధులు కేటాయించి సొంత భవనాలు నిర్మించాలని వసతి గృహాల మౌలిక వసతులు ఉండేలా చూడాలని పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను వెంటనే పున ప్రారంభించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు జీవో నెంబర్ 77ను రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ సౌకర్యాన్ని పునర్దించాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటేకరణ తక్షణమే నిర్మించాలని ఎన్ టి ఏ ను రద్దు చేయాలని యూనివర్సిటీలకు తగినన్ని నిధులు కేటాయించి ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యా అందించడం ప్రభుత్వాల బాధ్యత అని విద్యారంగ సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వ నల్లచంగా వ్యవహరిస్తే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులను ఐక్యం చేసి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు మార్పు రావాలి మార్పు కావాలి విద్యారంగ పరిరక్షణ జరగాలి అనే నినాదంతో విద్యార్థుల హక్కుల కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ జిల్లా నాయకులు అజయ్, తరుణ్,ధనుష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



## ఎమ్మెల్యే సుందరపు జన్మదిన వేడుకలు

**మునగపాక, ఆగస్టు 20, జయ జయహే:**

ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ జన్మదిన వేడుకలు గురువారం గ్రామ గ్రామాన నిర్వహించారు. మునగపాకలో గురువారం ఉదయం జనతా గ్యారేజ్ కార్యాలయంలో సుందరపు జన్మదిన వేడుకలను జనసేన మండల పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశు రాం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మునగపాక సాయిబాబా గుడిలో ఎమ్మెల్యే ఆరోగ్యంగా ఉండాలని, నిండు నూరేళ్లు హాయిగా ఆనందంగా ప్రజలకు సేవ చేస్తూ ఉండాలని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం మునగపాక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవి సత్యనారాయణ, కాంద్రేగుల పరమేశ్వర్ సంధ్య, కోయిలాడ దశావతారం, కాంద్రేగులు నూకప్పరావు, ఎల్లపు భాస్కరరావు, ఆడారి గోవిందు, ఆడారి భాస్కరరావు, ప్రసాదు, సూరిబాబు, గణేష్ బాబు, మూలపేటలో జెకె బ్రదర్స్, కాంద్రేగుల గాంధీ, నాగులపల్లిలో పెంటకోట శివ, చూచుకొండలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో, అరబుపాలెంలో ఎల్లపు సంతోష్ ఆధ్వర్యంలోని, వాడ్రపల్లిలో మల్ల రాజేష్, కోయిలాడ దశావతారం ఆధ్వర్యంలో వేరువేరుగా సుందరపు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.



## టీడీపీ మస్తాన్ నాయుడు మృతి

**తోట్టంబేడు.ఆగస్టు 20,జయ జయహే.**

తొట్టంబేడు మండలం, కాసరం పంచాయతీ కొండ్రాజు పల్లి గ్రామానికి చెందిన టీడీపీ మస్తాన్ నాయుడు గుండెనొప్పి తో మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ మండల పార్టీ అధ్యక్షులు గాలి మురళి నాయుడు నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి గారికి తెలియజేయగా,శాసనసభ్యులు చరవాణి ద్వారా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మస్తాన్ నాయుడు భౌతిక కాయానికి గాలి మురళి నాయుడు, మహేష్ నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు చింతపట్ల భాస్కర్ నాయుడు, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి చెన్ను రాఘవులు యాదవ్, బాలయ్య నాయుడు, గౌడ్, సుబ్రహ్మణ్యం నాయుడు పూలమాల వేసి నివాళులు అర్పించారు.




## బి.ఎన్. కండ్రిగలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం

**బుచ్చినాయుడు కండిగ, ఆగష్టు 20, జయ జయహే**

మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవశీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ మురళి రెడ్డి, డాక్టర్ ఉదయ్ కుమార్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జ్వరాల పై అవగాహన, దోమల నియంత్రణ పై అవగాహన సదస్సు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## వరసిద్ధుని దర్శించుకున్న బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ మల్లికార్జున

**పూతలపట్టు, ఆగస్టు 20, జయ జయహే.**

శ్రీ స్వయంభువరసిద్ధి వినాయక స్వామిని గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిసి వెల్ఫేర్ డైరెక్టర్, సర్ రోల్ అబ్జర్వర్ మల్లికార్జున దర్శించుకున్నారు. వీరికి ఈ.వో పెంచల కిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరు డిఆర్ఓ మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు, ప్రోటోకాల్ ఏఈఓ ధనపాల్, సూపర్డెంట్ వాసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# జీవీఎంసీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ప్రణాళిక



**- వార్డుల డీలిమిటేషన్‌పై అభ్యంతరాలు, ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలి**

**- నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలి.**

**- పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాలు**

**- ఒక్క ఓటరు కూడా మినహాయింపు కాకూడదు**

**- పేర్లు పునరావృతం లేకుండా పరిశీలించాలి.**

**- రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరి**

**- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.**

**విశాఖపట్నం, ఆగస్టు 20, జయ జయహే**

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రానున్న జీవీఎంసీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేసి, పకడ్బందీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తి, చీఫ్ సిటీ ప్లానర్ ఏ. ప్రభాకర్ రావు, జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసే ఆదేశాలు, మార్గదర్శకాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అనుగుణంగా జీవీఎంసీ ఎన్నికల ఏర్పాట్ల ప్రక్రియకు ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా జీవీఎంసీ వార్డుల విస్తరణ, డీలిమిటేషన్‌కు సంబంధించి అందుతున్న అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిశీలించి నిబంధనల మేరకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని చీఫ్ సిటీ ప్లానర్, జోనల్ కమిషనర్లను ఆదేశించారు. అన్ని జోన్లలో పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి, ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఎంతమంది ఓటర్లు ఉన్నారనే వివరాలను పక్కాగా నమోదు చేయాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. ఓటర్ల జాబితాల్లో ఒక్క ఓటరు పేరు కూడా మినహాయింపు కాకుండా, ఏ ఒక్కరి పేరు పునరావృతం కాకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని, ఈ ప్రక్రియలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బంది, ఎన్నికల సామగ్రి నిర్వహణపై ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయడంతో పాటు, కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, వెలుతురు, మరుగుదొడ్లు, ర్యాంపులు, పారిశుధ్యం వంటి కనీస సదు–పాయాలు ఉండేలా పరిశీలించాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు అనుకూలంగా పోలింగ్ కేంద్రాలు ఉండేలా ప్రణాళిక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి జోన్‌లో ఎన్నికల ఏర్పాట్లపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, చేపట్టాల్సిన పనులు, బాధ్యత వహించే అధికారులు, పూర్తి చేయాల్సిన గడువులను నిర్దేశిస్తూ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ అదనపు కమిషనర్ డివి రమణమూర్తికి ఆదేశించారు. ఈ సమీక్షలో జీవీఎంసీ సిటీ ప్లానర్, సహాయ పట్టణ ప్రణాళిక అధికారులు, డిపిఓ నాగార్జున, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్, జోనల్ పర్యవేక్షకులు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



## మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడితో మాటా మంతీ

**హాజరైన నగర ప్రముఖులు**

**విశాఖపట్నం, ఆగస్టు 20, జయ జయహే**

భారత పూర్వ ఉపరాష్ట్రపతి పద్మవిభూషణ్ ముప్పవరపు వెంకయ్యనాయుడు గురువారం విశాఖ చేరుకున్నారు. ఈ సందర్భంగా వేములపల్లి కోటేశ్వరరావు దంపతులు ఏర్పాటు చేసినమాటా –మంతీ– ఆత్మీయ కలయిక మధ్యాహ్నభోజనం కార్యక్రమానికి హోటల్ దసపల్లాలో సతీసమేతంగా జరిగింది.వెంకయ్య నాయుడుకి ఆత్మీయులైన నగరంలోని ప్రముఖులు దంపతులతో కలసి వారి అనుభవాలను చమత్కారాలతో ఒకరినొకరు పంచుకున్నారు. వెంకయ్య నాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్‌కు వారి తల్లిదండ్రులు సరస్వతీ ప్రసాద్ అనీ పెడితే బాగుండును...లక్ష్మీ ప్రసాద్ సరస్వతి పుత్రుడు అని కొనియాడారు. నా జీవిత చరిత్ర తెలుగులో రాసారు, ఇంగ్లీషులో రాసారు, హిందీలో నేను రాస్తాను మీ గురించి...బాగా తెలిసిన వాడిని...మీ జీవితంలో కొంత భాగం నా ప్రమేయం ఉన్నవాడిగా చరిత్ర నేను రాస్తానని అడిగినప్పుడు రాయమని చెప్పటంతో పుస్తకం రాసి ఢిల్లీలో పుస్తక ఆవిష్కరణ చేసిన సమయంలో హిందీలో చాలా చక్కగా రాసారని కేంద్రమంత్రి కొనియాడారు. ఈ ఆత్మీయ సమావేశం లో పద్మభూషన్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, దసపల్లా హోటల్ మేనేజింగ్ డైరెక్టర్ మండవ రాఘవేంద్రరావు, దాసరి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి తపోవర్ధన్, డాక్టర్ కె వి ప్రసాద్, పైడా కృష్ణ ప్రసాద్, ఎస్సార్ షాపింగ్ మాల్ అధినేత గోపీనాథ్ రెడ్డి, వేములపల్లి విద్యాసాగర్, ఆంధ్రాయూనివర్సిటీ తెలుగు, హిందీ విభాగాల అధ్యక్షులు జర్రా అప్పారావు , నల్లా సత్యనారాయణ వున్నారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల మురళి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పై కవిత రాసి వినిపించారు, వెంకయ్య నాయుడు జీవిత చరిత్ర హిందీలో రాసిన యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ ను వెంకయ్య నాయుడు ఈ సందర్భంగా సత్కరించారు.



## విశాఖ హార్బర్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**మత్స్యకారుల సంక్షేమమే కూటమి లక్ష్యం**

**డీజిల్ సబ్సిడీని 9 నుంచి 15 శాతానికి పెంచాలి**

**అసెంబ్లీలో ఎమ్మెల్యే వంశీకృష్ణ**

**విశాఖపట్నం, ఆగస్టు 20, జయ జయహే**

విశాఖపట్నం హార్బర్ దేశంలోనే అతిపెద్ద మత్స్యకార హార్బర్లలో ఒకటని, సుమారు 900 చిన్న, పెద్ద బోట్ల ద్వారా వేలాది మత్స్యకార కుటుంబాలు తమ జీవనోపాధిని కొనసాగిస్తున్నాయని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకారుల సంక్షేమానికి అనేక కీలక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సహకారంతో విశాఖ హార్బర్‌లో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని తెలిపారు. మత్స్యకార భరోసా మొత్తాన్ని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచడం, ప్రమాదవశాత్తు మత్స్యకారుడు మరణిస్తే అందించే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడం వంటి నిర్ణయాలు మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న భరోసాకు నిదర్శనమన్నారు. మత్స్యకారులకు జీపీఎస్ పరికరాలు, సబ్సిడీపై వలలు అందించడంతో పాటు బోట్ల మరమ్మతులకు ఉపయోగపడే క్రేన్‌ను హార్బర్‌లో ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గత రెండు, మూడు సంవత్సరాలుగా ప్రమాదాల్లో అనేక బోట్లు మునిగిపోవడం, మరికొన్ని బోట్లు అగ్నిప్రమాదాలకు గురై పూర్తిగా కాలిపోవడం జరిగిందని, బాధితులకు ఇప్పటివరకు తగిన నష్టపరిహారం అందలేదని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత బోట్ల యజమానులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా గానీ, ఇతర ప్రభుత్వ సహాయ పథకాల ద్వారా గానీ ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మత్స్యకారుల ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు పోరాడుతామని, విశాఖ హార్బర్ అభివృద్ధితో పాటు మత్స్యకార కుటుంబాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని స్పష్టం చేశారు.



## సెయింట్ జోసెఫ్ కాలేజీ స్కాట్ అండ్ గైడ్స్‌కు అభినందన

**విశాఖపట్నం (జయ జయహే)**

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విశాఖపట్నం జిల్లా సెయింట్ జోసెఫ్ మహిళ కాలేజీ చెందిన ఇద్దరు రేంజర్స్ అమరావతి లో జరిగిన రాష్ట్ర స్థాయి ఇండిపెండెన్స్ డే వేడుకలలో మార్చ్ ఫస్ట్ పాల్గొన్నారు వారిని జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి. గోపి కృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్ అండ్ గైడ్స్ లో విద్యార్థులు చేరడం వాళ్ళ క్రమశిక్షణ వస్తుంది, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఇండిపెండెన్స్ డే వేడుకలలో విశాఖపట్నం జిల్లా విద్యార్థులు పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని, ప్రతి ఒక్క విద్యార్థి కూడా రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో జరిగే కార్యక్రమంలో పాల్గొవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దాసరి వేణు గోపాల్, రాష్ట్ర యూత్ చైర్ పర్సన్ మరియు జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ డాక్టర్ మారుతి హరీష్ కుమార్, జిల్లా రోవర్స్ కమిషనర్ సి హచ్ చిత్తరంజన్ దేశాయ్, జిల్లా రేంజర్స్ కమిషనర్ కె. పద్మ, రేంజర్ లీడర్ డాక్టర్ మేరీ అనుపమ, రేంజర్స్ లిశిక సాయి, పి. భవన పాల్గొన్నారు.

## సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు పంపిణి చేసిన బొజ్జల రిషిత రెడ్డి

**శ్రీకాళహస్తి, ఆగస్టు 20, జయ జయహే.**



అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్రీకాళహస్తి పట్టణంలోని 16 మంది బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధదారులకు రూ,10,16,875లను బొజ్జల రిషితా రెడ్డి అందజేశారు. కార్యక్రమంలోటీడీపీ పట్టణ అధ్యక్షుడు జి విజయ్ కుమార్, కంటా రమేష్, మిన్నల్ రవి, పేట బాలాజీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## నరసయ్యపేటలో ఉచిత క్యాన్సర్ పరీక్షలు

**చోడవరం ఆగస్టు 20 జయ జయహే**

వడ్డాది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నరసయ్యపేట ఆరోగ్య మందిరంలో గురువారం ఉచిత క్యాన్సర్ పరీక్షలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగనంపూడి హోమి బాబా క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నోరు,రొమ్ము, గర్భాశయ ముఖా ద్వారా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నమిత ,డాక్టర్ జీవన్ మాట్లాడుతూ క్యాన్సర్ ను ముందుగా గుర్తించడం ద్వారా సులువుగా నివారించవచ్చని ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు వలన దీన్ని నివారించవచ్చని బీడీ,సిగరెట్టు, ఖైని,గుట్కా తంబాకు ,ఆల్కహాల్ వంటి దురాలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు.ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారిని మాధవి, మాజీ సర్పంచ్ నాగబాబు ప్రభుత్వం అందించే సేవలు సద్వినియోగం చేసుకుని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో నరసయ్య పేట వైద్య సిబ్బంది, సచివాల సిబ్బంది సూపర్వైజర్, హోమీ బాబా సిబ్బంది కూటమి నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో 95 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.




## అసెంబ్లీలో ప్రస్తావించిన స్పందించని ప్రభుత్వం

**13వ రోజు చేరుకున్న దీక్షలు**

**చోడవరం ఆగస్టు 20 జయ జయహే**

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతుల కార్మికుల బకాయిలు చెల్లించాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ చేపట్టిన రిలే నిరాహార దీక్ష గురువారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. ఈ విషయంపై చోడవరశ్రీ ఎమ్మెల్యే రాజు అసెంబ్లీ సమావేశాలు దృష్టికి తీసుకెళ్లిన ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ రైతుల కార్మికుల బకాయిలు, రోడ్లు మర మత్తుల కోసం ఇంత వరకు కూటమి ప్రభుత్వం నుండి ఎటువంటి అధికారిక ప్రకటన రాకపోవడం విచారకరమన్నారు. ఒకపక్క ఇప్పటికే రైతుల వరి పంటలు వర్షా లేక ఆకుమడులు ఎండిపోతున్నాయనీ, మరోపక్క చెరుకు బకాయిలు రాకపోవడం బాధ, ఎటు చూసినా రైతు నలిగిపోతున్నాడనీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఏ కోడూరు వస్తున్న సందర్భంగా అనకాపల్లి జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు అందరూ ముఖ్యమంత్రి తో మాట్లాడి రైతులు కార్మికుల బకాయిలు ఇచ్చే విధంగా అభ్యర్థించాలని ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే లందరినీ కోరుతుంది. 13వ రోజు రిలే నిరాహార దీక్ష శిబిరంలో అనకాపల్లి జిల్లా ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు, పల్లె వెంకటరమణమూర్తి, దాట్ల వెంకటేశ్వరరాజు చెరకు రైతు అప్పలనాయుడు చెరుకు రైతు సూర్యనారాయణ పాల్గొన్నారు.

# షుగర్స్ రైతుల బకాయిల చెల్లింపునకు కలెక్టర్

**తిరుపతి, ఆగస్టు 20, జయ జయహే.**



సూదలగుంట షుగర్స్ యూనిట్--1, యూనిట్--2కు సంబంధించి రైతులకు, రవాణా కాంట్రాక్టర్లు, హార్వెస్టింగ్ కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను త్వరితగతిన ఇప్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుతో కలిసి రైతుల బకాయిల అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సూదలగుంట షుగర్స్‌కు సంబంధించి గతంలో ఉన్న బకాయిలు, ప్రస్తుతం చెల్లించాల్సిన మొత్తాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, బకాయిల వసూలుకు ఇప్పటివరకు చేపట్టిన చర్యలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు.2018--19 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి సుమారు రూ.30 కోట్ల మేర రైతులకు బకాయిలు ఉండగా, 2022లో అప్పటి చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆర్ఆర్ యాక్ట్ కింద చర్యలు చేపట్టి, ఊతుకోటలోని సుమారు 106 ఎకరాల భూమిని వేలం ద్వారా విక్రయించి రైతులకు సుమారు రూ.15 కోట్ల వరకు చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ప్రస్తుతం అదనపు చెరకు ధరతో కలిపి సూదలగుంట షుగర్స్ యూనిట్--1, యూనిట్--2కు సంబంధించి రైతులకు సుమారు రూ.27 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, అదేవిధంగా రవాణా కాంట్రాక్టర్లు, హార్వెస్టింగ్ కార్మికులకు మరో రూ.3 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు సమావేశంలో వెల్లడించారు. బకాయిల వసూలుకు సంబంధించి నమోదైన చెక్ బౌన్స్ కేసులో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయిన అంశాన్ని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కలెక్టర్ డిప్యూటీ కేన్ కమిషనర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ, రైతుల బకాయిల పరిష్కారానికి సంబంధించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడితో ఈ అంశంపై కలెక్టర్ చర్చించారు. కోర్టు జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారెంట్‌ను చట్టపరమైన నిబంధనల మేరకు అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన జిల్లా ఎస్పీ వారెంట్ అమలుకు తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.సమావేశంలో రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువస్తూ, గత ఎనిమిది సంవత్సరాలుగా బకాయిలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. బకాయిల కోసం ఎదురుచూస్తున్న పలువురు రైతులు మృతి చెందారని, తమ కుటుంబాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొంటూ, బకాయిలను వీలైనంత త్వరగా ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. రైతుల విజ్ఞప్తిపై కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ వెంటనే స్పందించారు. నెల్లూరు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి, అక్కడ ఉన్న సంబంధిత ఆస్తుల వేలం ప్రక్రియను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే బి.ఎన్. కండ్రిగలో జప్తు చేసిన సుమారు 83 ఎకరాల భూమికి కూడా త్వరితగతిన వేలం నిర్వహించి, నిబంధనల మేరకు వచ్చిన మొత్తాన్ని రైతుల బకాయిల చెల్లింపునకు వినియోగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ఈ సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపే దిశగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

For a pure tomorrow.. జయహే

# శ్రావణ మాసపు వరలక్ష్మీ వ్రతము-ప్రత్యేక శీర్షిక

## చారుమతి స్వప్న దర్శన వరలక్ష్మి దేవి వ్రత కథ

**శ్రావణమాసం ఆరంభం నుండి శ్రావణమాసం ముగింపు వరకు శుక్రవారాలు ఎంతో మహోన్నతమైనవి. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం లేదా శ్రావణమాసంలో రెండవ శుక్రవారం రోజున అమ్మవారికి అత్యంత ప్రీతికరమైనది గా భావించి శ్రీ వరలక్ష్మీ వ్రతాన్ని సుమంగళీలు అందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని ఎందుకు ఆచరించాలి అంటే సౌభాగ్యం సంతానం దీర్ఘాయుష్షు మొదలైన సత్ఫలితాలన్నీ వస్తాయి అని నానుడి. భారతదేశంలో ప్రతి ఇంట్లో అనాదిగా జరుపుకుంటున్న సంప్రదాయ పూజల్లో ముత్తైదువులందరికీ ఇది ఒక ప్రత్యేకమైన వ్రతం. అమ్మవారి యొక్క రూపు పెట్టుకొని, కొందరు అమ్మవారి చిత్రపటాన్ని కొందరు, కలశం పెట్టుకొని మరికొందరు, ఎంతో భక్తి శ్రద్ధలతో వ్రతాన్ని ఆచరిస్తారు.**




**కలశ స్థాపన:**

""కలశస్య ఒకే విష్ణుః కంటే రుద్రః సమాశ్రితః
మూలే తత్ర స్థితో బ్రహ్మ మధ్యే మాతృఘణా స్మృతః""

అర్థం : ఈ పై కలశ శ్లోకానికి శ్లోకానికి అంతరార్థం ఏంటంటే కలశ మూలంలో బ్రహ్మదేవుడు సృష్టికి ఆధారమైతే కలశ మధ్య భాగంలో విష్ణువు పోషణ మన యొక్క స్థితికి కారకుడు అవుతాడు కలశ కంఠంలో రుద్రుడు అంటే శివుడు లయకారుడు నీళ్లు అంటే సప్త సముద్రాలు అలాగే అందులో ఉంచేటువంటి బియ్యం ధాన్యలక్ష్మి మామిడాకులు మన యొక్క ప్రకృతి మరియు సంతానంతో సమానం.. కలశం లో ఉంచే నారికేళం లక్ష్మీదేవి ముఖము.ఈ కలశంలో బ్రహ్మ విష్ణు రుద్రుడు నాలుగు వేదాలు ఏడు సముద్రాలు అందరు దేవతలు ఉన్నారు పూజ కోసం రండి అని ప్రార్థించి కలశ స్థాపన చేయడం.

**కలశ పూజ: ధ్యాన శ్లోకంతో మొదలుపెట్టాలి.**

నైవేద్యం పెట్టే సమయం: లక్ష్మీ గాయత్రి మంత్రాన్ని 11 సార్లు చదవాలి.

వరలక్ష్మి అమ్మవారి వ్రత కథ: పూర్వకాలంలో మగధ దేశంలో కుండినం అనే పట్టణం ఉండేది అక్కడ ఉన్న గ్రామ ప్రజలందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారిని ఎక్కువగా పూజించేవారు. ఆ గ్రామంలో నివసిస్తున్న చారుమతి అనే గృహిణి.

భర్తతో ఎంతో అన్యోన్యంగా ఉంటూ భార్యాభర్తలిరువురు ఎన్నో రకాలుగా అమ్మవారి పూజలను ప్రతినిత్యం ఆరాధిస్తూ ఉండేవారు. అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ఎక్కువగా పూజ చేసేది. చారుమతికి అమ్మవారు అంటే ఎంతో ప్రీతి. ఏ సమయంలో ఏ కష్టం వచ్చినా ఏ ఇబ్బంది వచ్చినా అమ్మవారి మీద నమ్మకం ఉంచి ప్రసన్నంగా నడుచుకునేది.అమ్మవారి ఆలోచనలు చేస్తూ కాలం గడుపుతూ ఉండేది. ఒకసారి చారుమతి నిద్రలోకి జారుకున్న సమయంలో ఆమెకు ఒక స్వప్నశీ వచ్చింది. ఆ స్వప్నంలో సాక్షాత్తు శ్రీ మహాలక్ష్మి అమ్మవారు దర్శనం ఇచ్చారు. చారుమతి ఎంతో భక్తి శ్రద్ధలతో నువ్వు చేస్తున్న పూజలు నువ్వు చేస్తున్న నోములు మెచ్చి నీ కలలోకి వచ్చాను రేపు శుక్రవారం రోజు నువ్వు నన్ను వరలక్ష్మీ రూపంతో నా వ్రతం ఆచరించు ఇదే వరలక్ష్మీ వ్రతం అని చెప్పి అమ్మవారు అంతర్ధానమయ్యారు. చారుమతికి వెనువెంటనే మెలకువ వచ్చి తన భర్త అత్తమామలతో చెప్పి తన తల్లిదండ్రులతో చెప్పి మరుసటి రోజు ఉదయం వ్రతం ఆచరించుటకు సంసిద్ధురాలు అయింది. ఎంతో భక్తిశ్రద్ధలతో అమ్మవారి యొక్క రూపుని కలశ స్థాపన చేసి చక్కటి మహా నైవేద్యాలతో 11 రకాల పిండివంటలతో అమ్మను ప్రసన్నం చేసుకుంటూ వ్రతాన్ని నియమనిష్ఠలతో చక్కగా పూర్తి చేసుకుంది. వ్రతం పూర్తి అయ్యేసరికి చారుమతి నివాస గృహంలో అష్టైశ్వర్యాలు సంతానం భోగభాగ్యాలు సుమంగళకరంగా అమ్మవారు ఇచ్చారు.

వరలక్ష్మీ వ్రతం యొక్క ఫలితము: ప్రతీ గృహిణి తన యొక్క నివాస గృహంలో దైవ మండపంలో ఈ వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తే అష్టైశ్వర్యాలతో సంపదలతో సౌభాగ్యంతో తులతూగుతారు అని ప్రతీక.

చారుమతి నామధేయ వివరణ: చారు అనగా "సత్" - మంచి అని అర్థము.

మతి అనగా విశాల బుద్ధి అని అర్థము. ఈ చారుమతి అనే నామానికి మంచి బుద్ధి కలిగినటువంటిది అని గొప్ప విశేష అర్థము. ఇటువంటి నామధేయాలు పెట్టుకోవడం వలన ఆడపిల్లలు ఎంతో సౌభాగ్యంతో విరాజిల్లుతూ ఉంటారు.

తోరం కట్టుకునే సమయంలో: లక్ష్మీ అష్టోత్తరం చదవాలి.

మంగళ హారతి : అమ్మవారి హారతి పాట పాడి ముగించాలి.

**వ్రతము తాంబూలాలు వితరణ:**

మగువలు అందరూ ఎంతో మంగళప్రదంగా వ్రతం పూర్తిచేసుకుని బంధువులను చుట్టుపక్కల ఉన్న ముత్తైదువులను ఇంటికి సాయంత్రం ఆహ్వానించి మంగళకరమైన సౌభాగ్య వస్తువులైన చీర రవిక గాజులు, పువ్వులు పండ్లు శనగలు పళ్లెంలో ఉంచి వచ్చిన మహిళకి పాదములకు పసుపు రాసి బొట్టు పెట్టి కంఠానికి గంధం ఉంచి శ్రీ వరమహాలక్ష్మి దేవితో సమానంగా భావించి మహిళలకు ఆ తాంబూలము ను అందించి పాదాలకు నమస్కారం చేస్తే వ్రతం యొక్క ఉత్తమ ఫలితాన్ని పొందగలుగుతాము.

కలియుగంలో అసలు ఇటువంటి వ్రతాలు ఎందుకు చేయాలి: సమాజంలో ఎన్నో రకాలైన జరగకూడని చెడు జరుగుతూ ఉండడం వలన ఇటువంటి వ్రత ఆచరణ చేయడం ద్వారా మానవజాతిలో అనేక అనేక మార్పులు మంచి ఆలోచనలు కలుగుతూ ఉంటాయి. ఎవరైతే వారి ఇంటిలో శుభప్రదంగా మంగళప్రదంగా వ్రతాన్ని చేస్తారో ఆ ఇంటి వాతావరణం అంతా సౌభాగ్యంగా ఉంటుంది. విజ్ఞాన శాస్త్రంతో ముడిపెట్టి చెప్పాలి అంటే ఇటువంటి వ్రతాలు చేసే సమయంలో ఇంటిని శుభ్రపరచుకోవడం, ఇంటిలో శుచిగా, శుభ్రముగా, వేడిగా ఆహారాన్ని తయారు చేసుకుని అందరూ కలిసి తినడం వలన ఎంతో ఆనందదాయకం మంగళకరము. పూజా సమయంలో యుక్త వయస్సు ఆడపిల్లలు ఇంటిలో పరికిణి లు ధరించి అడుగులు వేస్తుంటే ఎంతో సౌభాగ్యము కలుగుతుంది అని భావము.

" సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్ధసాధికే శరణ్య త్రయంబకే గౌరీ నారాయణి నమోస్తుతే..!!"

ముత్తైదు వేల రూపంలో ఉన్న లక్ష్మీదేవికి నమస్కారం మాకు సౌభాగ్యం సంతానం సౌఖ్యం ఇవ్వండి తల్లి..

అందరికీ వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలతో....



రచన..
ఏ బాల సౌజన్యకుమారి,
అనకాపల్లి



## చెన్నై బెంగళూరు రహదారిపై ప్రమాదం.

### ఒకరు మృతి, పలవురికి గాయాలు

**బంగారుపాళ్యం,ఆగస్టు 20, జయ జయహే.**

బంగారుపాలెం మండలం నల్లగాంపల్లి సమీపంలోని హైవే పై ప్రైవేట్ బస్సు ప్రమాదానికి గురైంది. వేలూరు నుండి మదనపల్లి కి వెళుతున్న బస్సు టైర్ పేలిఅదుపుతప్పడంతో లారీని ఢీకొనినలగాంపల్లి సమీపంలో ఉన్న పొలాల్లోకి వెళ్లిశీది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు బంగారు పాలెం సిఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా పలవురికి స్వల్ప గాయాలైనట్టు సమాచారం.గాయపడిన వారిని బంగారు పాలెం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుని వివరాలు పోలీసులు సేకరిస్తున్నారు.

## గిరిజన కాఫీ రైతుల పిల్లల స్కాలర్‌షిప్‌లు పెంచాలి

### శెట్టి రాజు డిమాండ్.

అనంతగిరి, ఆగస్టు 20:( జయ జయహే) అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గిరిజన కాఫీ రైతుల పిల్లల ఉన్నత చదువుల కోసం స్కాలర్‌షిప్ నిధులను వెంటనే మంజూరు చేయాలని బిజెపి కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరంలో గిరిజన విద్యార్థుల విద్య కోసం ప్రభుత్వం కోటి 35 లక్షల రూపాయలను స్కాలర్‌షిప్‌ల రూపంలో విడుదల చేసిందని గుర్తుచేశారు. అయితే, ప్రస్తుత విద్యాసంవత్సరంలో చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్య మరియు విద్యా వ్యయాలు



పెరిగినందున, ఈ బడ్జెట్‌ను గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఈ ఏడాది స్కాలర్‌షిప్ నిధులను రెండు కోట్ల 50 లక్షల రూపాయలకు పెంచి, తక్షణమే మంజూరు చేయాలని శెట్టి రాజు డిమాండ్ చేశారు. కాఫీ తోటలపైనే ఆధారపడి జీవిస్తున్న గిరిజన కుటుంబాల పిల్లలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిస్తుందని, వారు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి తోడ్పడుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం దీనిపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.




## పోలీస్ క్వార్టర్స్‌లోనే దొంగలు... కానిస్టేబుల్ ఇంటికే కన్నం!

### తాళాలు పగలగొట్టి 23 తులాల బంగారం చోరీ

### గంటల వ్యవధిలోనే దొంగను పట్టుకున్నామన్న డీసీపీ లతా మాధురి

**విశాఖపట్నం, ఆగస్టు 20, జయ జయహే**

రిజర్వ్ కానిస్టేబుల్ బండారు ముత్యాల నాయుడు ఇంటికే కన్నం వేసిన పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ ఘరనా దొంగను గంటల వ్యవధిలోనే నగర పోలీసులు పట్టుకుని చోరీ సొత్తును రికవరీ చేశారు. ఈ విషయాన్ని క్రైమ్స్ డీసీపీ లతా మాధురి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అల్లిపురం పోలీస్ క్వార్టర్స్‌లో కానిస్టేబుల్ ముత్యాల నాయుడు నివాసం ఉంటున్నాడు. అయితే బుధవారం మధ్యాహ్నం ఓ ఫంక్షన్ కోసం మధ్యాహ్నం ఒంటి గంటకు తాళం వేసి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లి రెండు గంటల వ్యవధిలోనే తిరిగి ఇంటికి చేరుకున్నారు. గుర్తుతెలియని దుండగులు ఆ ఇంటి మెయిన్ డోర్ తాళం విరగగొట్టి, పిల్లల బెడ్ రూమ్ లో వున్న ఇనుప బీరువా డోర్ విరగగొట్టి, లాకర్ లో వున్న దాదాపు 23 తులాల బంగారు ఆభరణాలు దొంగతనం చేసి పరారీ అయ్యారు. దీనిపై వెంటనే విశాఖపట్నం సిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. సీసీ టీవీ ఫుటేజీ..ఇతర సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో నిందితుడు 45 ఏళ్ల షరీఫ్ షేక్‌గా గుర్తించి ఆయన కదలికలపై నిఘా పెట్టి అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో అసలు విషయం పూసగుచ్చినట్టు చెప్పాడు. దీంతో చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి జైలుకు పంపించారు.

# రేపటి నుంచి బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశాలు

## ఏర్పాట్లపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, ఆగస్టు 20, జయ జయహే**

ఈ నెల 22, 23వ తేదీల్లో విశాఖ వేదికగా నిర్వహించనున్న బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశాలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో సమావేశాల ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. బ్రిక్స్ దేశాల నుంచి క్రీడా మంత్రులు, ఉన్నతాధికారులు విశాఖపట్నానికి రానున్నందున అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ర్యాడిషన్ బ్లూ, నోవాటెల్ హోటళ్లలో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 22న ఉదయం 8 గంటలకు తొట్లకొండలో బ్రిక్స్ క్రీడా మంత్రుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాడిషన్ బ్లూ హోటల్‌లో ద్వైపాక్షిక సమావేశాలు, యువజన వ్యవహారాలకు సంబంధించిన ఇతర సమావేశాలు



నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 22న సాయంత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి విదేశీ క్రీడా మంత్రులతో నోవాటెల్ లో జరిగే ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం విదేశీ అతిథులతో ముఖ్యమంత్రి గాలా డిన్నర్ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి, విదేశీ అతిథులతో కలిపి సుమారు 150 మంది పాల్గొనే అవకాశం ఉన్నందున రవాణా, భద్రత, ప్రోటోకాల్ తదితర అంశాల్లో సమన్వయం ఉండాలని సూచించారు.

**23న బీచ్ రోడ్డులో ఫ్రెండ్లీ సైక్లింగ్...!**

23న ఉదయం బీచ్ రోడ్డులో ఫ్రెండ్లీ సైక్లింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జీవిఎంసి ఆధ్వర్యంలో 40 సైకిళ్లు, క్రీడా శాఖ ఆధ్వర్యంలో 25 సైకిళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉదయం 8 గంటల వరకు నోవాటెల్ నుంచి వైఎంసీఏ వరకు వాహనాల రాకపోకలను అనుమతించకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. సైకిల్ ర్యాలీ జరిగే ప్రాంతంలో వాకింగ్, వ్యాయామం చేసే వారికి కూడా తాత్కాలికంగా అనుమతి ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలకు ముందస్తు సమాచారం అందేలా మార్గమధ్యంలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 23వ తేదీ సాయం త్రం రుషికొండ బీచ్‌లో విదేశీ అతిథులకు డిన్నర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్య ప్రాంతాల్లో వెల్‌కమ్ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు విశాఖ, ఆంధ్రప్రదేశ్ స్థానిక సంప్రదాయాలు, సంస్కృతి ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన సంస్కృతిని ప్రతిబింబించే థింసా నృత్య ప్రదర్శనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో నగర సుందరీకరణ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. బ్రిక్స్ క్రీడా మంత్రుల సమావేశాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమీక్షలో శాప్ ఎండీ భరణి, డీసీపీ మణికంఠ, డీఆర్వో ఎం. విశ్వేశ్వర నాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com